తాను ఏం మాట్లాడాలో
తెలిసిన వాడు తెలివైన వాడు
తాను ఏం మాట్లాడకూడదో
తెలుసుకోగలిగినవాడు వివేకవంతుడు
-స్వామి వివేకానంద

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 205 | శనివారం 17 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## దాడి చేస్తే ప్రతీకారమే

- ట్రంప్‌నకు ఇరాన్ హెచ్చరిక వెనక్కి తగ్గిన అమెరికా
- వైమానిక బేస్‌ల నుంచి సిబ్బంది ఉపసంహరణ

**దుబాయ్/దోహా– సూర్య వాస్తవం :**

తమ దేశంపై అమెరికా దాడి చేస్తే ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దీనితో వాషింగ్టన్ ఓ అడుగు వెనక్కి వేసింది. అమెరికా మధ్యప్రాచ్యంలోని వైమానిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని బుధవారం అమెరికా అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ ఎదుర్కొంటున్న దేశీయ అశాంతిని అణచివేయడానికి ఇరాన్ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారుల తరపున జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే బెదిరింపు ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే



అమెరికాకు గట్టి సమాధానం ఇచ్చేందుకు టెహ్రాన్ సిద్ధమైంది.

- మిగతా 2లో..

## స్టార్టప్ ఇండియాకు పదేళ్లు..

- దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- 'స్టార్టప్ ఇండియా' మిషన్‌కు పదేళ్లు పూర్తి
- దేశ యువత నిజమైన సమస్యలను పరిష్కరిస్తోందన్న మోదీ
- పదేళ్లలో 500 నుంచి 2 లక్షలకు పైగా చేరిన స్టార్టప్‌లు
- 125కు పైగా యూనికార్న్‌లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- స్టార్టప్‌లలో మహిళల భాగస్వామ్యం పెరిగిందన్న ప్రధాని

2లో





## ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు...

- రేపు శంకుస్థాపన చేయనున్న
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శంకుస్థాపన
- రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,600 మందికి ఉపాధి అవకాశాలు
- హరిత ఇంధన రంగంలో దేశంలోనే కీలక ముందడుగు

**అమరావతి– సూర్య వాస్తవం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హరిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఒక చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే భారీ పరిశ్రమకు కాకినాడ వేదిక కాబోతోంది. రేపు (జనవరి 17) ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థ సుమారు రూ.13 వేల కోట్ల భారీ పెట్టుబడితో

- మిగతా 2లో..

## 'ఏపీ ఫస్ట్..

- తిరుపతిలో అతి పెద్ద రీసెర్చ్ సెంటర్
- సీఎం చంద్రబాబు ప్రకటన
- తిరుపతిలో 'ఏపీ ఫస్ట్' పేరుతో భారీ పరిశోధన కేంద్రం
- ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో యువతకు నైపుణ్యం అందించడమే లక్ష్యం
- రాష్ట్రంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశం
- వ్యవసాయం, వైద్యంలో డ్రోన్ల వినియోగం పెంచాలని సూచన



**అమరావతి– సూర్య వాస్తవం :**

ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు

- మిగతా 2లో..

## కాకినాడలో 'ఏఎమ్ గ్రీన్ రూ.90 వేల కోట్ల పెట్టుబడి...

- మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా టెర్మినల్
- 8,000కు పైగా ఉద్యోగ అవకాశాలు
- జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు గ్రీన్ ఎనర్జీ ఎగుమతి
- ప్రపంచ గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కీలక స్థానం



2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## భూములివ్వలేం..

- విద్య ద్వారానే జీవితాల్లో మార్పు
- నిరుద్యోగుల్ని బీఆర్ఎస్ మోసం చేసింది
- వారి ఉద్యోగాలు పోతేనే.. మీకు ఉద్యోగాలొస్తున్నాయి
- రెండేండ్లలో 70 వేల ఖాళీలు భర్తీ చేశాం
- అశోక్ నగర్ నుంచి ఉస్మానియా వరకు అన్నీ తెలుసు
- నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి
- గ్రూప్ 3 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ – సూర్య వాస్తవం :**

ప్రజలకు పంచేందుకు భూముల్లేవనీ, విద్యను మాత్రమే అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని తెలిపారు. వివిధ శాఖల్లో గ్రూప్ 3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పదేండ్లలో ఆ పార్టీ నేతలు సొంత లాభం చూసుకున్నారే తప్ప నిరుద్యోగులను పట్టించుకోలేదన్నారు. ఓయూ విద్యార్థులు ఉద్యమకారులై ప్రాణత్యాగాలు చేసి సాధించిన తెలంగాణలో వారొక్క కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. వారి ఉద్యోగాలు ఊడితే తమకు ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకుందని అన్నారు. 14 ఏండ్ల పాటు గ్రూప్-1 ఖాళీలు భర్తీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒకట్రెండు నోటిఫికేషన్లు ఇచ్చినా పేపర్ లీక్‌లతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసిందని వ్యాఖ్యానించారు. తాము అధికారం చేపట్టిన తర్వాత టీజీపీఎస్సీని బలోపేతం చేసి విద్యావంతులను, నిష్ణాతులను సభ్యులుగా నియమించామని చెప్పారు.

- మిగతా 2లో..



## పాలించడానికి మీరు అర్హులేనా?

- చంద్రబాబుపై జగన్ ఫైర్
- సాల్మన్ హత్యపై ఏం సమాధానం చెపుతారంటూ చంద్రబాబుకు జగన్ ప్రశ్న
- అధికార పార్టీ నేతలు, పోలీసులు కలిసి కుట్ర చేస్తున్నారని మండిపాటు
- మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిక

**అమరావతి– సూర్య వాస్తవం :**

గురజాల నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్త సాల్మన్ హత్యపై వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా స్పం దించారు. రాజకీయ కక్షలతో

- మిగతా 2లో..

# స్టార్టప్ ఇండియాకు పదేళ్లు..

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం :**
భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన 'స్టార్టప్ ఇండియా' మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు. పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి.

**అందరినీ కలుపుకొని వృద్ధి**
స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు. ఒకప్పుడు స్టార్టప్‌లను వైఫల్యానికి దారితీసే మార్గంగా, కేవలం సంపన్నుల పిల్లలకే పరిమితమైనవిగా చూసేవారని, కానీ స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఈ దృక్పథాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపారు.

# 'ఏపీ ఫస్ట్..

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు.

**డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి**
ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు. "డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ల వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు.
ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలించడానికి మీరు అర్హులేనా?

(మొదటిపేజీ తరువాయి)
ఇలాంటి అరాచకాలు జరుగుతున్నాయంటూ చంద్రబాబును ఉద్దేశించి ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నలు సంధించారు. "చంద్రబాబు... మీరు పాలించడానికి అర్హులేనా? రాజకీయ కక్షలతో ఎంతమంది ప్రాణాలను బలి తీసుకుంటారు? ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం, రాజకీయ పాలన ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా?" అంటూ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, దళిత యువకుడు మందా సాల్మన్ హత్యపై మీరు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. అనారోగ్యంతో ఉన్న భార్యను చూడటానికి సొంత గ్రామానికి వచ్చిన సాల్మన్‌ను ఇనుప రాడ్లతో కొట్టి హత్య చేయడం అమానుషమని అన్నారు. ఈ ఘటన పూర్తిగా వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు అధికార పార్టీ నేతలు, కొంతమంది పోలీసులు కలిసి చేస్తున్న కుట్రేనని జగన్ ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, తమకు నచ్చని వారిని బెదిరించడం, హత్యా రాజకీయాలకు పాల్పడటం వల్లే పిన్నెల్లి గ్రామం నుంచి వందలాది వైసీపీ కార్యకర్తల కుటుంబాలు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి పల్నాడు జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.
ఇంత జరుగుతున్నా సిగ్గు లేకుండా ఈ ప్రభుత్వం హింసను ప్రోత్సహిస్తోందని జగన్ విమర్శించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా జీవించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమవడం మాత్రమే కాకుండా, కక్షల కోసం శాంతిభద్రతలను దెబ్బతీస్తూ హత్యా రాజకీయాలకు వెన్నుదన్నుగా నిలవడం ఘోరమైన నేరమని అన్నారు. ఇది స్పష్టమైన రాజ్యాంగ ఉల్లంఘన అని పేర్కొంటూ, హింసా రాజకీయాలకు పాల్పడుతున్న వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని, తప్పకుండా మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# దాడి చేస్తే ప్రతీకారమే

(మొదటిపేజీ తరువాయి)
ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన ప్రాంతాల్లోని కీలక స్థావరాల నుంచి అమెరికా కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సైనిక జోక్యం జరిగే అవకాశం ఉందని యూరోపియన్ అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో దీనిపై ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని ఓ ఇజ్రాయిల్ అధికారి తెలిపారు. అయితే దాని పరిధి, సమయాన్ని స్పష్టంగా చెప్పలేదు.

**ఖతార్‌లో యూఎస్ ఎయిర్‌బేస్**
ఖతార్‌లోని అతిపెద్ద యూఎస్ స్థావరం అయిన అల్ ఉదీద్ వైమానిక స్థావరం నుంచి ఉపసంహరణలు జరుగుతున్నాయని ఖతార్ దేశం కూడా తెలిపింది. గతేడాది ఇరాన్ క్షిపణి దాడికి కొన్ని గంటల ముందు జరిగినట్టుగా పెద్ద సంఖ్యలో సైనికులను సాకర్ స్టేడియం, షాపింగ్ మాల్‌కు బస్సుల్లో తరలించినట్లు తక్షణ సంకేతాలు లేనప్పటికీ, కొంతమంది సిబ్బందిని స్థావరం నుంచి బయటకు వెళ్లమని చెప్పినట్టు ముగ్గురు దౌత్యవేత్తలు తెలిపారు. ఇరాన్‌లో రెండు వారాల క్రితం ఆ దేశ ఆర్థిక పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రదర్శనలుగా ప్రారంభమయ్యాయి. ఈ అశాంతిని ఇటీవలి రోజుల్లో వేగంగా తీవ్రతరం చేసి, ఇరాన్‌లో మతాధికారుల పాలనను స్థాపించిన 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అత్యంత హింసాత్మకమైనదంటూ ఆదేశంపై పాశ్చాత్య దేశాలు ప్రచారం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో 2,600 మందికి పైగా మరణించారని ఒక హక్కుల సంస్థ పేర్కొన్నట్టు వార్తల్ని విస్తృతం చేశారు. అయితే ఇరాన్ ఇంతటి విధ్వంసాన్ని ఎప్పుడూ ఎదుర్కోలేదని ఆ దేశ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దుల్‌రహీం మౌసావి బుధవారం తెలిపారు. పాశ్చాత్య దేశాల ప్రచారాన్ని విదేశీ శత్రువులని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లోని అంతర్గత వ్యవహారాలపై ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్-నోయెల్ బారోట్ మాట్లాడుతూ ఇరాన్ సమకాలీన చరిత్రలో ఇదో అత్యంత హింసాత్మక అణచివేత అని కామెంట్స్ చేశారు. దీనిని కూడా ఇరాన్ అధికారులు సమర్థవంతంగా తిప్పికొడుతున్నారు. తమ దేశంలో అశాంతిని సాయుధ ఉగ్రవాదుల పేరుతో అమెరికా, ఇజ్రాయిల్ రెచ్చగొడుతున్నాయని చెప్పారు. మరోవైపు యూఎస్ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుంటే, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి టర్కీ వరకు ప్రాంతీయ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడి చేస్తామని టెహ్రాన్ స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మధ్య ప్రత్యక్ష సంబంధాలను నిలిపివేశారు. ఖతార్‌లోని అల్ ఉదీద్‌లో సెంట్రల్ కమాండ్ ఫార్వర్డ్ హెడ్‌క్వార్టర్స్, బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీకి చెందిన ఐదవ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంతో సహా ఈ ప్రాంతం అంతా యూఎస్ బలగాల స్థావరాలు ఉన్నాయి. ఇరాన్ ప్రభుత్వం పతనం అంచున ఉన్నట్టు కనిపించడం లేదంటూ ఓ పాశ్చాత్య అధికారి చెప్తూ, అక్కడి మరణహోమం తీవ్రంగా ఉందంటూ ఆరోపణలు చేశారు.

# భూములివ్వలేం..

(మొదటిపేజీ తరువాయి)
ఇటీవల గ్రూప్-1 నియామక పత్రాలు ఇచ్చే సమయంలో కూడా కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో 60 వేలు, రెండో ఏడాది 10 వేలు, మొత్తం రెండేండ్లలో 70 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని సీఎం తెలిపారు. "కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన మీరు మీ తల్లిదండ్రుల కండ్లల్లో సంతోషం నింపాలి. పుట్టిన బిడ్డ ప్రయోజకుడైతే వారి ఆనందా నికి అవధులుండవు. ఉద్యోగాలు భర్తీ చేయడం మా బాధ్యత. కానీ మీకు జీవితకాల విజయం. ఉద్యోగం మీ కుటుంబంలో భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుంది. కేవలం వేతనం తీసుకునేది మాత్రమే కాదని.. ఉద్యోగం భావోద్వేగం అని గుర్తుంచుకోండి. తెలంగాణ పునర్నిర్మా ణంలో కలిసి రావాలి. అందరు కలిసికట్టుగా పని చేస్తే ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తాం. రాష్ట్ర ప్రభుత్వంలో 10.5 లక్షల మంది ఉద్యోగులు వివిధ దశల్లో ఉన్నారు. వారి అడుగు జాడల్లో నడిచి సర్కార్‌కు మంచి పేరు తేవాలి" అని సీఎం వారికి దిశా నిర్దేశం చేశారు.

**విద్యతోనే అభివృద్ధి**
ఏ దేశమైనా, ఏ సమాజమైనా విద్యతోనే అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ మొదటి ప్రధాని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ మొదటి ప్రాధాన్యతగా విద్య, వ్యవసాయాన్ని తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని అన్ని యూనివర్సిటీలు, శ్రీశైలం, నాగార్జున సాగర్, ఎస్ఆర్ఎస్పీ లాంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. అయితే నేడు విద్య, ఆహారం అందరికీ అందుతున్నా నాణ్యమైనది దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది, 11 వేల ప్రయివేట్ పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. ఈ వ్యత్యాసం ఎందుకుంది? తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎందుకు ప్రయివేట్ స్కూళ్లలో చదివిస్తున్నారో ఆలోచించాలన్నారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నా మన పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని ఎందుకు అందించలేకపోతున్నామని ప్రశ్నించారు. ఈ క్రమంలో తమ సర్కార్ నాణ్యమైన విద్య, ఆహారాన్ని పిల్లలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. పిల్లలు తాము అభ్యసించిన విద్యలో నాణ్యత లేక పోతే అవకాశాలు కూడా దొరకవని హెచ్చరించారు. "రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది ఇంజినీరింగ్ పట్ట భద్రులు వస్తున్నా వారికి తగిన ఉద్యోగం రావడం లేదు. డిమాండ్ ఉంది. సరఫరా ఉంది. కాని స్కిల్స్ లేకపోవడమే కారణం. రేపటి రోజుల్లో స్కిల్స్ అభివృద్ధి చేయాలి. ఇవ్వడానికి భూముల్లేవు. కానీ విద్య ఒక్కటే మన జీవితాల్లో మార్పు తెస్తుంది. సీఎస్, డీజీపీ వరకు ఉద్యోగాలు అందరికి విద్య ద్వారానే వచ్చాయి. ప్రస్తుతం నియామక పత్రాలు అందుకుంటున్న 1,370 మందికి ఉద్యోగాలు విద్య వల్లనే వచ్చాయి. ఈ ప్రభుత్వానికి వారధులు, సారధులు మీరే. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్లకు తీసుకుపోవాలనేది కేంద్ర సర్కార్ లక్ష్యం. అదే స్ఫూర్తితో తెలంగాణ ఎకానమిని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల మార్క్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశ జనాభాలో 2.5 శాతంగా ఉన్న మనం 5 శాతం ఎకానమిని అందిస్తు న్నాం. 2047 నాటికి 10 శాతం అందించాలనేదే లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో మీరందరూ నిబద్ధతతో పని చేయండి. విధుల్లో చేరిన రోజు ఎంత నిబద్ధతతో పని చేశారో.. అదే నిబద్ధతతో రిటైర్మెంట్ వరకూ పని చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి వారికి సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేసిన వారి జీతంలోంచి 15 శాతం కోత విధించి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. "అశోక్‌నగర్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వరకు ఏం జరుగుతుందో నాకు అవగాహన ఉంది. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రయివేట్‌లో సైతం భారీ పెట్టుబడులు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తాం" అని సీఎం నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు.

**మా పని తీరుకు నిదర్శనం: పొన్నం**
గత రెండేండ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేయడమే తమ సర్కార్ పని తీరుకు నిదర్శనమని మంత్రి పొన్నం పేర్కొన్నారు. "బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నియామకాలు ఆగిపోయాయి. కానీ మా సర్కార్ ఖాళీలను వెంట వెంటనే గుర్తించి వాటిని భర్తీ చేస్తోంది. పదేండ్లలో ఆర్టీసీలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ రాలేదు. కానీ నేడు మేం 3,500 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చాం" అని పొన్నం అన్నారు.

**నిబద్ధతతో పని చేయండి : సీఎస్**
'ఉద్యోగం కోసం ఎంత కష్టపడ్డారో మీ తల్లిదండ్రులకు తెలుసనీ, దాన్ని గుర్తుంచుకుని ముందుకు సాగాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. "ఈ పోటీలో 5.5లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 2.5లక్షల మంది రాశారు. అందులో 1,370 మంది సర్టిఫికెట్లను అందుకుంటున్నారు. మీరు సాధించిన విజయం వ్యక్తిగతం. కాని నేటి నుంచి ప్రజల కోసం అని గుర్తుంచుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించాలి" అని సీఎస్ సూచించారు. ప్రభుత్వ ఫలాలు సమాజంలోని చిట్ట చివరి వరకు అందేలా సేవలందించాలని కోరారు. నిబద్ధతతో పని చేసి తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న వారితో సీఎస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు అభ్యర్థులకు నియామక పత్రాలను సీఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, హర్కార్ వేణుగోపాల్ ఎంపీలు బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు...

(మొదటిపేజీ తరువాయి)
ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏడాది క్రితమే ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా, ఇప్పుడు ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుంది.

**ప్లాంట్ విశేషాలు.. వేల ఉద్యోగాలు**
గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత టెక్నాలజీతో పనిచేసే ఈ ప్లాంట్ ద్వారా ఏటా 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడలో సుమారు 495 ఎకరాల విస్తీర్ణంలో, గతంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ ఉన్న ప్రదేశంలో ఈ కొత్త ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 2027 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు చేప ట్టనున్నారు. శనివారం ఉదయం 10:30 గంటలకు అమరావతి నుంచి బయలు దేరనున్న ముఖ్యమంత్రి, 11:20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, అనంతరం ప్రసంగిస్తారు.

**పర్యావరణ హితం.. ప్రపంచానికి ఎగుమతులు**
బొగ్గు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలతో తయారు చేసే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా, ఈ గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో ఎలాంటి కర్బన ఉద్గారాలు వెలువడవు. పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా తయారయ్యే ఈ ఇంధనం పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించదు. ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా పెట్టుకున్న ప్రస్తుత తరుణంలో, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాకినాడ పోర్టుకు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఈ ప్లాంట్ ఉండటం వల్ల, ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమోనియాను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు అద్భుతమైన అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఏఎమ్ గ్రీన్ సంస్థ జర్మనీకి చెందిన యూనిపర్ ఎస్‌ఈతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుతో పాటే, కాకినాడలోనే సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో 2 గిగావాట్ల సామర్థ్యం గల ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను కూడా ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్ జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు.. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ హరిత ఇంధన పటంలో కీలక స్థానంలో నిలపనుంది.

# కాకినాడలో 'ఏఎమ్ గ్రీన్ రూ.90 వేల కోట్ల పెట్టుబడి...

- మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ భారీ ప్రాజెక్ట్
- 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా టెర్మినల్
- 8,000కు పైగా ఉద్యోగ అవకాశాలు
- జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు గ్రీన్ ఎనర్జీ ఎగుమతి
- ప్రపంచ గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కీలక స్థానం

**అమరావతి- సూర్య వాస్తవం :**
ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడి రాబోతోంది. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ (గూవీ +తీవవఅ) సంస్థ ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 90,000 కోట్లు) పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ఎగుమతి టెర్మినల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 8,000 మందికి పైగా నాణ్యమైన ఉద్యోగాలు లభించనున్నాయని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఏఎమ్ గ్రీన్ ఏర్పాటు చేయనున్న ఈ టెర్మినల్ ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇక్కడ తయారైన గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, సింగపూర్, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్‌ను దాదాపు 7.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం, 1 గిగావాట్ పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ద్వారా సమకూర్చనున్నారు. అమ్మోనియా రూపంలో గ్రీన్ ఎనర్జీని విదేశాలకు ఎగుమతి చేయడం భారతదేశ చరిత్రలోనే ఇది తొలిసారని లోకేశ్ పేర్కొన్నారు. ఈ భారీ పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ గ్రీన్ ఎనర్జీ వ్యాల్యూ చెయిన్‌లో అగ్రగామిగా నిలవనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతాన్ని ఇవ్వడమే కాకుండా, హరిత ఇంధన రంగంలో ఏపీకి కీలక స్థానాన్ని కట్టబెట్టనుందని తెలిపారు.

# సంపాదకీయం

## యుద్ధానికి దారి తీస్తున్న సంక్షోభం



ఇరాన్ నిరసనల సంక్షోభం యుద్ధానికి దారితీస్తోంది.అమెరికా సైనికులు ఇరాన్ దిశగా కదులుతున్నాయి. ఇరాన్ ప్రతీకార చర్యలు ప్రకటించింది. నిరసనల్లో హింసకు దిగిన ఇరాన్‌పై ట్రంప్ గట్టి సూచనలు జారీ చేశారు. ఇప్పుడు అది సైనిక చర్యలుగా మారనుంది. పశ్చిమాసియా స్థావరాల నుంచి భారీ ఎయిర్‌ఫోర్స్ ఇరాన్ లక్ష్యంగా ఉంది.యూఎస్ బేసుల నుంచి యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఇంధన ట్యాంకర్లు ఇరాన్ వైపు బయలుదేరాయి. ఇది దాడి సిద్ధతలకు స్పష్టమైన సంకేతం. ప్రాంతీయ ఉద్రిక్తత మరింత పెరిగింది.అమెరికా చర్యలకు ఇరాన్ తిరుగుబాటు పన్నుతుంది. దాడి వస్తే తిరిగి ఒడ్డుబాటు చేస్తామని హెచ్చరించింది. ఇది ఉభయకాలీన యుద్ధ ఆకర్షణలకు దారి తీసే అవకాశం.ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో పెద్ద సంఘర్షణకు దారితీయవచ్చు. ఇరాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభంతో 20 రోజులుగా దేశ ప్రజలు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. వీటికి అమెరికా మద్దతు తెలుపుతోంది. మరోవైపు నిరసనలను ఇరాన్ అణచివేస్తోంది. ఇప్పటికే 2 వేల మందికిపైగా మరణించారు. ఈ క్రమంలో అమెరికా ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతోంది. అయితే దాడి తీవ్రతపై ఇంకా స్పష్టత లేదు. ఖతార్‌లోని అల్?ఉదెయిద్ వైమానిక బేస్‌తో పాటు పలు ప్రాంతీయ స్థావరాల నుంచి సిబ్బందిని ఆపాద్ చేస్తోంది అమెరికా. ఇరాన్ రక్షణ చర్యలు చేపట్టింది. భారత్,బ్రిటన్ తమ దేశ పౌరులను వెనక్కి రావాలని సూచించాయి.ఆందోళనల సమయంలో మృతుల సంఖ్య 2,571కి చేరింది. ప్రజలు భయంతో రాత్రులు గడుపుతున్నారు. భద్రతా సిబ్బందిలోని సుమారు 100 మందికి సామూహిక అంత్యక్రియలు జరిగాయి. నిరసనకారులపై ఇరాన్ చర్యలు తప్పుబట్టి ట్రంప్ మానవత్వం చూపాలని కోరారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జాతీయ భద్రతా సమావేశాల్లో ఇరాన్ వ్యూహాలు చర్చించారు.ఇరాన్ జ్యుడీషియరీ ప్రధాని ఘోలామ్ హుసేన్ మొహ్సెనీ?ఎజీ, ఆందోళనకారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలస్యం వల్ల ప్రభావం తగ్గుతుందని అన్నారు. మరణశిక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది టెహ్రాన్. మరోవైపు ఇంటర్నెట్ బ్లాక్ చేసిన ఇరాన్‌లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ ఉచిత సేవలు అందిస్తోంది. ఉపగ్రహాల ద్వారా పౌరులు బయటి ప్రపంచంతో కనెక్ట్ అవుతున్నారు.పరిస్థితులు తీవ్రతరం కావడంతో భారత్ తన పౌరులకు ఇరాన్ వదిలి వెళ్లాలని సూచించింది. కొత్తగా ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించింది. అక్కడ 10 వేల మందికిపైగా భారతీయులు ఉన్నారు.అమెరికా మిత్రరాజ్యాలు ఆలర్ట్‌లో ఉన్నాయి. ఇరాన్ ఆర్థిక, సైనిక ఒత్తిడులు పెరిగ్తున్నాయి. అంతర్జాతీయ మధ్యవర్తిత్వం అవసరమవుతుంది. అమెరికాతో ఏడాదిగా సన్నిహితంగా కొనసాగుతున్న పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ఇప్పుడు ఇరుకున పడుతున్నారు. ఇటీవలే హమాస్‌ను అంతం చేయడానికి పాలస్తీనాలో యూఏఈ సైన్యంతో కలిసి పాల్గొనాలని డొనాల్డ ట్రంప్ పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్‌ను ఆదేశించారు. పాకిస్తాన్ ప్రజలకు పాలస్తీనాతో సత్సంబంధాలు సానుభూతి ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా, హమాస్‌కు వ్యతిరేకంగా రంగంలోకి దిగడం పాకిస్తాన్ సైన్యానికి సవాల్‌గా మారింది. దీనిపై తర్జనభర్జన పడుతున్న తరుణంలో పాకిస్తాన్‌కు ట్రంప్ నుంచి మళ్లీ కీలక ఆదేశాలు అందాయి. ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్న తరుణంలో పాకిస్తాన్‌కు చెందిన 30 వేల మంది సైనికులను ఇరాన్ సరిహద్దులో మోహరించాలని నిర్ణయించినట్లు సమాచారం.పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు అమెరికా అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌లో అమెరికా?ఇజ్రాయిల్ కూటమి ఏదైనా భూ ఆపరేషన్‌లకు మద్దతుగా ఈ చర్య ఉండవచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల మధ్యప్రాచ్యలో ఇజ్రాయిల్?ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రమైన స్థితిలో ఉన్నాయి, ఇది ప్రాంతీయ భద్రతకు సవాలుగా మారింది.ఈ పరిణామాలు భారతదేశానికి కూడా ప్రభావం చూపవచ్చు. పాకిస్తాన్ ఇరాన్ సరిహద్దులో శ్రద్ధ పెంచడం వల్ల భారత్?పాకిస్తాన్ సరిహద్దులపై ఒత్తిడి తగ్గవచ్చు. అయితే, అమెరికా ప్రభావంతో పాకిస్తాన్ మధ్యప్రాచ్య విషయాల్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటే, దక్షిణాసియాలో బలాబలాలు మారుతాయి. భారత్ తన రక్షణ వ్యూహాలను మళ్లీ పరిశీలించాల్సి వస్తుందిఅమెరికా?ఇజ్రాయిల్ కోఆర్డినేషన్ పెరిగితే, ఇరాన్‌పై భూ దాడుల అవకాశం ఉంది. పాకిస్తాన్ ఈ సందర్భంలో తన సరిహద్దులను రక్షించుకోవడమే కాకుండా, మిత్రరాజ్యాలకు సహాయం చేయవచ్చు. ఇది చైనా, రష్యా వంటి ఇరాన్ మిత్రులతో ఉద్రిక్తతలను పెంచవచ్చు. ప్రపంచ శాంతి కోసం ఐక్యరాష్ట్ర సమితి జోక్యం అవసరం.ఇరాన్‌పై యుద్ధం మొదలైతే చమురు ధరలు పెరగవచ్చు, ఇది భారత్‌లో ఇన్‌ఫ్లేషన్‌కు కారణమవుతుంది. పాకిస్తాన్?అమెరికా బంధాలు బలపడతాయి, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతాయి. బాలూచిస్తాన్ వంటి ప్రాంతాల్లో తిరుగుబాట్లు పెరిగే అవకాశం ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ 2.0 ప్రారంభించేందుకు అనువైన సమయం.ఈ చర్యలు మధ్యప్రాచ్య యుద్ధానికి దారితీయవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయి. పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకునేలా అమెరికా ఒత్తిడి చేసిందా అనేది ఇంకా స్పష్టంగా లేదు.



# ఏపీలో నీళ్ల రాజకీయం...



**విజయవాడ – సూర్య వాస్తవం :** తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు నీళ్ల రాజకీయాన్ని నమ్ముకున్నాయి. అయితే రెండు రాష్ట్రాల్లో చంద్రబాబును సాకుగా చూపి ఉద్యమాలకు శ్రీకారం చుదుతున్నాయి. చంద్రబాబుతో రాజీ పడి తెలంగాణ ప్రయోజనాలను గాలికి వదిలేసారని రేవంత్ పై మండిపడుతున్నారు గులాబీ పార్టీ నేతలు. తెలంగాణ సీఎం రేవంత్ తో రహస్య ఒప్పందం చేసుకొని ఏపీ ప్రయోజనాలను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడించి ఆపించానని తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. అప్పటి నుంచి రచ్చ ప్రారంభం అయ్యింది. అయితే అది ముందుగానే నిలిచి పోయిందని.. రేవంత్ చెప్పిన దాంట్లో ఎంత మాత్రం నిజం లేదని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. తద్వారా జగన్మోహన్ రెడ్డి హయాంలో తామే ఆ పనులు ఆపించామని వారు చెప్పుకొస్తున్నారు. అయితే ఏపీలో వైసీపీ నేతలు మాత్రం తెలంగాణతో రాజీపడి రాయలసీమకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని జగన్ ఆలోచన చేశారు. తన పార్టీకి ఆయువుపట్టుగా భావించే రాయలసీమకు ప్రయోజనం కల్పించాలన్నది జగన్ టార్గెట్. కృష్ణా నదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. అయితే సరిహద్దు జలాలకు సంబంధించిన నీటి వినియోగం కాబట్టి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. అలా అనుమతులు తీసుకున్న తర్వాత ఈ భారీ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి. కానీ జగన్మోహన్ రెడ్డి ఆ పని చేయలేదు. తద్వారా ప్రాజెక్టు పై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతోంది. అయితే అప్పటికే తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కొన్ని రకాల అభ్యంతరాలు తెలంగాణ నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అనుమతులు ఇవ్వకపోవడంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది 2020లో. కేవలం ఈ ప్రాంత సెంటిమెంట్తో కూడుకున్న పని కావడంతో జగన్మోహన్ రెడ్డి ఆ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు కట్టడం సులువు కాదు. ఆ విషయం తెలిసి కూడా జగన్మోహన్ రెడ్డి ఆ ప్రయత్నం చేశారు అంటే దాని వెనుక ఉన్న పరమార్థం ఇట్టే తెలిసిపోతోంది.మొన్నటికి మొన్న బనకచర్ల ప్రాజెక్ట కోసం ఆలోచన చేశారు చంద్రబాబు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని భావించారు. కేవలం సముద్రంలో కలిసిపోతున్న నదీ జలాలను తరలించడం ద్వారా రాయలసీమలో సాగునీటి కొరత లేకుండా చేయవచ్చని భావించారు. అయితే దీనికి తెలంగాణ సమాజం నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అదే సమయంలో ఏపీలోని మిగతా రాజకీయ పక్షాల సహకారం కూటమి ప్రభుత్వానికి కరువైంది. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నోరు తెరవలేదు. కానీ బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్తో పాటు గులాబీ పార్టీ నేతలు సైతం విమర్శలు చేశారు. కానీ ఏపీకి మద్దతుగా ఈ ప్రాజెక్టు కావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కనీసం కోరలేదు. అప్పట్లో కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో కనీస ప్రస్తావన లేదు. ఎప్పుడైతే తెలంగాణ సీఎం రేవంత్ చంద్రబాబు తో మాట్లాడి ఎత్తిపోతల పథకాన్ని ఆపించానని చెప్పడంతో.. దీనిని ఒక రాజకీయ అంశంగా మార్చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.మాజీమంత్రి కీలక ప్రకటన.. రాయలసీమ జల ప్రయోజనాల కోసం ఇప్పుడు వైసీపీ ఉద్యమ బాట పట్టాలని నిర్ణయించింది. అవసరం అనుకుంటే పాదయాత్ర చేస్తామని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రకటన చేశారు అంటే.. ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. తాము ప్రారంభించిన ప్రాజెక్టు నిలిచిపోవడం నిజం. వాటి అనుమతుల విషయంలో నిబంధనలు పాటించకపోవడం వాస్తవం. కానీ ఈ ప్రాజెక్టు చంద్రబాబు వల్లే నిలిచిపోయిందని చెబుతూ ఇప్పుడు వైసిపి నీళ్ల రాజకీయాలకు శ్రీకారం చుడుతుండడం మాత్రం గమనార్హం. అయితే మరోసారి ప్రజలకు ఈ విషయంలో వాస్తవాలు తెలిస్తే మాత్రం ఆ పార్టీకి ఇబ్బందికరమే.

# మరో ఎంపీకి కేంద్ర మంత్రి పదవి...



**విజయవాడ,నెల్లూరు-సూర్య వాస్తవం :** కేంద్ర మంత్రివర్గ విస్తరణ పై ఊహాగానాలు వస్తు న్నాయి. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ జరుపుతారని ప్రచారం నడుస్తోంది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి నేతలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. మిత్రపక్షాలకు సైతం పెద్ద ఎత్తున అవకాశం కల్పిస్తారని కూడా పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోంది. అందులో భాగంగా ఏపీలో తెలుగుదేశం పార్టీకి మరో మంత్రి పదవి ఖాయమని సమాచారం. ఇప్పటికే ఆ పార్టీకి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు ఏపీ నుంచి. ఏపీ నుంచి బిజెపికి ఒక మంత్రి పదవి ఉంది. అయితే జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉండగా.. ఒక మంత్రి పదవి కూడా కేటాయించలేదు. అయితే ఇప్పుడు జనసేనకు కాకుండా టిడిపికి మరో పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఓ సీనియర్ నాయకుడికి ఆ బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఏపీ నుంచి ఎన్డీఏ తరపున 21 మంది ఎంపీలు గెలిచారు. అందులో 16 మంది తెలుగుదేశం పార్టీ నుంచి.. బిజెపి నుంచి ముగ్గురు? జనసేన నుంచి ఇద్దరు గెలిచారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగు ఎంపీలకు మాత్రమే పరిమితం అయింది. టిడిపి నుంచి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రి పదవి దక్కింది. కీలకమైన పౌర విమానయాన చూస్తున్నారు ఆయన. గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ సైతం కేంద్రమంత్రి అయ్యారు. తొలిసారిగా గుంటూరు నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. అయినా సరే ప్రధాని మోదీ తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు. మరోవైపు నరసాపురం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ. ఆయనకు అనూహ్యంగా కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. వాస్తవానికి బిజెపి తరఫున రాజమండ్రి నుంచి గెలిచిన పురందేశ్వరికి కానీ.. అనకాపల్లి నుంచి గెలిచిన సీఎం రమేష్ కు కానీ క్యాబినెట్ పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు బిజెపికి ఏపీ నుంచి మరో మంత్రి పదవి వస్తుందంటే కచ్చితంగా పురందేశ్వరి, సీఎం రమేష్ మధ్య గట్టి పోటీ ఉంటుంది.జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి బాలశౌరి, కాకినాడ నుంచి మరొకరు గెలిచారు. అయితే ఈసారి జనసేనకు చాన్స్ ఇస్తే మాత్రం కచ్చితంగా బాలశౌరికి అవకాశం ఉంటుంది. అయితే తెలుగుదేశం పార్టీకి ఇస్తే మాత్రం సామాజిక ఈక్వేషన్స్ ఖాయం. అయితే ప్రధానంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజ్యసభ సభ్యుడిగా ఉండేవారు ప్రభాకర్ రెడ్డి. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు భార్య ప్రశాంతి రెడ్డి కూడా టిడిపిలో చేరారు. నెల్లూరు ఎంపీగా పోటీ చేసి గెలిచారు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. అయితే నెల్లూరులో పరిస్థితి మారడం వెనుక వేమిరెడ్డి పాత్ర ఉంది. పైగా ఆర్థికంగా స్థితిమంతుడు కావడంతో ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. వేమిరెడ్డికి ఇస్తే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు తో పాటు ప్రకాశం జిల్లాలో అన్ని అసెంబ్లీ సీట్లతో పాటు ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవచ్చని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రి పదవికి ఆయన పేరు సిఫారసు చేసినట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఏపీలో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు



**కడప-సూర్య వాస్తవం :** రాయలసీమను రతనాల సీమగా పేర్కొం టారు. ఖనిజ సంపదకు పెట్టింది పేరు కూడా. అందుకే ఖనిజాల కాణాచి అంటారు. చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో ఖనిజ నిక్షేపాలు అధికం. రాయలసీమలో దొరికే ఖనిజ నిక్షేపాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని.. ఇది అత్యంత విలువ చేసే గని అని అమెరికా పరిశోధనల్లో తేలినట్లు ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా తిరుపతి జిల్లాలోని మంగంపేట బెరైటీస్ గనుల్లో అరుదైన పుల్లరిన్ ఖనిజా నిక్షేపాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు సమాచారం. నానో టెక్నాలజీకి కీలకమైన పుల్లరిన్ వెలికి తీస్తే దేశ భవిష్యత్తే మారిపోతుంది. ప్రస్తుతం దీనిపైనే పెద్ద చర్చ నడుస్తోంది.సుమారు 18 సంవత్సరాల కిందట మంగంపేటగనుల్లో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటినుంచి లోతైన అధ్యయనం కొనసాగుతోంది. పుల్లరిన్ అనేది కార్బన్ మిళితమైన ఓ పదార్థం. గోళ, స్థూపాకార ఆకృతుల్లో ఉండే ఖనిజం. అయితే ఇది ఉక్కు కంటే దృఢత్వంలో 2005 రెట్లు ఎక్కువ. పది రెట్లు తేలికైంది కూడా. అందుకే అమెరికా లోతైన పరిశోధనలు చేపట్టింది. మిగతా దేశాలు సైతం ఇప్పుడు అదే పనిలో ఉన్నాయి. మంగంపేట బెరైటీస్ గని పరిసరాల్లో మొత్తం 156 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నమూనాలు సేకరించి పరీక్షించారు. భువనేశ్వర్ లోని ఐఎంఎంటీ బృందం సైతం ఇక్కడ నమూనాలను సేకరించింది. కానీ తరువాత ఎందుకో సైలెంట్ అయింది.పుల్లరిన్ అనేది ప్రత్యేక ఖనిజం. ఎన్నో రకాల ప్రయోజనాలు దీని సొంతం. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, పిడుగుపాటు నుంచి రక్షణకు విమానాలకు పైపూతగా దీనిని వాడుతారు. క్షిపణులకు ఈ పూత రాస్తే రాడార్లు కూడా పసిగట్టలేవు. ప్రధానంగా ఇంధన వాహకాల తయారీలో ఈ ఖనిజాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్, సోలార్ ఎనర్జీ టెక్నాలజీ పరంగాను దీనిని వాడుతారు. ఇంతటి ఈ ఖనిజంపై అమెరికా సీరియస్ గా పరిశోధనలు చేస్తోంది. సక్సెస్ అయితే ఈ ఖనిజం నిజంగా బంగారమే. ఈ దేశ తలరాతనే మార్చేస్తుంది.

## ముసల్‌రెడ్డిపల్లెలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- పల్లె పండుగ 2.0'లో భాగంగా ఘనంగా ప్రారంభోత్సవాలు**



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :** సింహాద్రిపురం మండల పరిధిలోని ముసల్‌రెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం 'పల్లె పండుగ 2.0' కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా 'పల్లె పండుగ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అజ్జుగుట్టు రఘునాథరెడ్డి పర్యవేక్షణలో ముసల్‌రెడ్డిపల్లెలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న సింగం రెడ్డి అమర్నాథ్ రెడ్డి ని బీటెక్ రవి వారి స్వగృహంలో పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి , తొండూరు మండల టీడీపీ పరిశీలకుడు మారెడ్డి భరత్ రెడ్డి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను సత్కరించిన బీటెక్ రవి





**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :** నేపాల్ వేదికగా గత డిసెంబర్ నెలలో నిర్వహించిన సౌత్ ఏషియన్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్లో భారత జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుని దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ విజేతలైన భారత జట్టులో కడప జిల్లాకు చెందిన రాచవీటి తేజేంద్ర, తిరుపతి జిల్లాకు చెందిన రెడ్డిచర్ల దేవి ప్రియ పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మరెడ్డి రవీంద్రనాథ రెడ్డి బీటెక్ రవి తన నివాసంలో క్రీడాకారులను ఆత్మీయంగా ఆహ్వానించి సన్మానించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ దాదాపు ఏడు దేశాల జట్లతో పోటీపడి విజయం సాధించడం అత్యంత గర్వకారణమని, ఈ విజయంతో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## ఎస్‌సి కాలనీలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**లింగాల- సూర్య వాస్తవం :** ప్రతి సంవత్సరం మకర సంక్రాంతి రోజున ముగ్గుల పోటీలతో లింగాల ఎస్సీ కాలనీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూలిసమస్త జీవాలకు జీవం పోసేలి సూర్యభగవానుడికి అర్పించేలి కృతజ్ఞతల పండగ. సంక్రాంతి అంటే మన మట్టి పండగ, మన ఊరి గాలి, మన పొలం వాసన, మన మట్టిలోని మాధుర్యాన్ని ముగ్గులతో అలంకరించిన ముంగిట, ఇదే నిజమైన సంక్రాంతి. అందరం కలిసి మన పెద్దలను తలుచుకుంటూ మన మూలాలను గుర్తు చేసుకుంటూ, మన పండుగను మనసారా జరుపుకుంటాం అని అన్నారు. అనంతరం బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. మొదటి బహుమతి స్రవంతి, రెండవ బహుమతి మహేశ్వరి, మూడవ బహుమతి జయలక్ష్మి, గెలుచుకోవడం జరిగింది. గెలిచిన ప్రతి ఒక్కరికి నగదు చీరలను సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణమ్మ దంపతుల చేతుల మీదుగా మహిళలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. అనంతరం ఎస్‌సిఎస్‌ఆర్, అగ్రహారం రవి అధ్యక్షతన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపిఎమ్ ఆంజనేయులు, శివశంకర్ రెడ్డి, రాజ, వెంకటేశ్వర్ రెడ్డి, గోపాల్, హేమంత్, రాములయ్య, గణేష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# అనంతలో దండుపాళ్యం బ్యాచ్

- 19 నెలలుగా ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు
- బందిపోటు ముఠా నాయకుడిగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పీఏలు శ్రీరాములు, గంగారాం
- చంద్రబాబు, నారా లోకేష్ ఆశీస్సులతోనే అరాచకాలు
- ఖాళీ జాగా కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు
- ప్రభుత్వ కార్యాలయాల్లో యథేచ్ఛగా దందాలు
- అనుకూలమైన పోలీసులను నియమించుకుని బెదిరింపులు
- సినిమా ఆడాలన్నా.. షోరూంలు ప్రారంభించాలన్నా ఎమ్మెల్యే పర్మిషన్ కావాలా?
- లాటరీలో మద్యం షాపులొస్తే మీకు ముడుపులివ్వాలా?
- కొత్తగా ఇల్లు కట్టుకోవాలంటే ఎమ్మెల్యే ఆఫీస్‌ను సంప్రదించాలా?
- గతంలో ఎవరు అధికారంలో ఉన్న ఇలాంటి పరిస్థితి లేదు
- టీడీపీ వాళ్ల ప్రాణాలకే రక్షణ లేకుంటే.. సామాన్యుల పరిస్థితేంటి?
- పోలీసు ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరితోనే ఈ దుస్థితి
- దండుపాళ్యం బ్యాచ్‌లో పోలీసులు, రెవెన్యూ అధికారులు
- అందరి లావాదేవీలు పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకొస్తాయ్..!
- ఈ పాలేగాళ్లకు ఎవరూ భయపడొద్దు.. మీకు అండగా ఉంటాం
- ప్రశాంతత కోరుకునే పార్టీలు, ప్రజాసంఘాలందరూ తోడుంటాం
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ




**అనంతపురం- సూర్య వాస్తవం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురంలో దండుపాళ్యం బ్యాచ్ తయారైందని, ఈ ముఠాకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. 19 నెలలుగా అనంతపురంలో దాడులు, దౌర్జన్యాలు, కబ్జాల పరంపర కొనసాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ ఆశీస్సులతోనే అరాచకాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ఆయన అనుచరులు చేస్తున్న దందాలను ఆయన వివరించారు. అనంత మాట్లాడుతూ...' 'అనంతపురం నగరం అంటేనే ప్రశాంతతకు మారుపేరు. చాలా మంది ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగ రిత్యా వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఎవరు అధికారంలో ఉన్నా.. ఏ పార్టీ వాళ్లు వ్యాపారాలు చేసుకున్నా ఇక్కడ ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. కానీ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో భిన్నమైన పరిస్థితి వచ్చింది. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు, ప్రతీకార చర్యలు నిత్యకృత్యమయ్యాయి. దండుపాళ్యం అనే సినిమా తరహాలో ఈ రోజు అనంతపురంలో పరిస్థితి వచ్చింది. అనంతపురం నగరాన్ని అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఠా నాయకుడిగా మారిపోయారు. అరాచక శక్తులు, ఇతర ప్రాంతాల నుంచి బంధువులను తెచ్చి ముఠా ఏర్పాటు చేసి ఆ ముఠాకు నాయకత్వం వహిస్తూ ఆలీ బాబా అరడజను దొంగల్లా ప్రవర్తిస్తున్నారు. ఎక్కడైనా ఖాళీ జాగా కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు. ఆ స్థలాలకు కంచెలు వేసి తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎవరైనా అది తమ స్థలం అని వస్తే బెదిరిస్తున్నారు. అధికారం అండతో పోలీసులను కూడా తనకు కావాల్సిన వాళ్లను నియమించుకుని బెదిరిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్లపై లేనిపోని ఆరోపణలు చేయడమే కాకుండా దాడులు చేసేలా దండుపాళ్యం బ్యాచ్ వ్యవహరిస్తోంది. మీరు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి.. మాకు సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ఆశీస్సులు ఉన్నాయని అంటున్నారు. ఎన్నికల్లో వాళ్లకు కోట్లు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నాం. ఇప్పుడు సంపాదించుకోవడానికి కూడా వాళ్ల మద్దతు ఉందంటూ బెదిరించే పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలే కాకుండా తాతముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులను కూడా కబ్జా చేస్తున్నారు. థియేటర్‌లో సినిమా ఆడించాలన్నా.. నగరంలో వ్యాపారం చేసుకోవాలన్నా.. ఏదైనా కొత్త షోరూం ప్రారంభించాలన్నా ఎమ్మెల్యే, ఎమ్మెల్యే ఆఫీస్‌తో పర్మిషన్ తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలో ఇళ్లు కట్టుకోవాలన్నా ఎమ్మెల్యే కార్యాలయానికి ముట్టజెప్పాలి. అప్పుడే టౌన్ ప్లానింగ్, కమిషనర్ పర్మిషన్ ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. పోలీస్ స్టేషన్లు, తహశీల్దార్ కార్యాంంలయాలకు వెళ్లినా ముందుగా ఎమ్మెల్యే ఆఫీస్‌కు వెళ్లండని చెబుతున్నారు. గతంలో ఏ పార్టీకి చెందిన వాళ్లు ఇక్కడ అధికారంలో ఉన్నా ఇలాంటి పరిస్థితి లేదు. ఒకప్పుడు ఫ్యాక్షనిస్టులు అనంతపురంలో నివాసం ఏర్పరచుకున్నా ఇంతలా ప్రవర్తించలేదు. గడిచిన 19 నెలలుగా అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. నారాయణపురం పంచాయతీలో బుడగజంగాలకు చెందిన ఐదున్నర ఎకరాలు కబ్జా చేశారు. అయినా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించలేదు. కక్కలపల్లిలో సాక్షాత్తూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భరత్ బంధువులకు చెందిన మూడున్నర ఎకరాలు ఆక్రమించ డానికి ప్రయత్నించారు. శారదానగర్ లోనూ ఇదే పరిస్థితి. కోస్తా ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ కనకదుర్గ ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. రోడ్డు ప్రమాదంలో వాళ్లు చనిపోతే నకిలీ పత్రాలు సృష్టించి ఇంటిని కబ్జా చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దందా జరుగుతోంది. అక్కడ సిబ్బందిపై దౌర్జన్యాలు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదు. తెలుగుదేశం పార్టీకి చెందిన లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న కూడా బాధితురాలే. ఏళ్ల తరబడి ఎగ్జిబిషన్ నడుపుకుంటున్న టీడీపీకే చెందిన ఫకృద్దీన్ ముడుపులు ఇవ్వలేదని దౌర్జన్యం చేశారు. మద్యం షాప్‌లో ముడుపులు ఇవ్వలేదని వెంకటరమణ అనే టీడీపీ వ్యక్తికి చెందిన షాప్‌నే తగలబెట్టే పరిస్థితి వచ్చింది. ఇన్ని ఘటనలు జరిగినా ఎస్పీ, డీఎస్పీ, డీఐజీలు ముఠాకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని ప్రశ్నించలేదు. వాళ్ల అనుచరులపై కూడా కేసులు పెట్టలేదు. అందుకే ఎలాంటి భయం లేకుండాపోతోంది. లాడ్జిల్లో గదులు ఇవ్వకపోయినా దౌర్జన్యాలు చేస్తున్నారు. అనంతపురంలోని లాడ్జిల్లో పేకాట, మట్కా యథేచ్ఛగా జరుగుతోంది. చివరకు టీడీపీ వాళ్ల ప్రాణాలకు కూడా రక్షణ లేని పరిస్థితి నెలకొంది.

చంద్రబాబును ఒక్కటే ప్రశ్నిస్తున్నా..! అనంతపురంలో బందిపోట్ల మాదిరిగా ప్రవర్తిస్తుంటే అసలు నీ ప్రభుత్వం ఉందా? నీ ఇంటెలిజెన్స్ ఏమైంది? జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు, మంత్రులు నీకు చెప్పడం లేదా? కలెక్టర్లు, ఎస్పీల మీటింగుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తోలు తీస్తామంటున్నావు..! 19 నెలలుగా ఎమ్మెల్యే, అతడి బంధులు అశోక్, స్వరూప్.. గంగారాం ఇంత చేస్తుంటే ఏం చేస్తున్నావు?

ఎప్పుడో నాలుగైదేళ్ల క్రితం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని నిమిషాల్లో అరెస్ట్ చేస్తున్న పోలీసులకు.. ఎమ్మెల్యే అనుచరులు చిక్కడం లేదంటే వాళ్ల చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది. నిందితులను పోలీసులే పక్కకు పంపారు.! అధికార పార్టీ నేతల దౌర్జన్యాలపై తెలుగుదేశం పార్టీ వాళ్లే ఫిర్యాదులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురంలో అనేక ఘటనలు జరిగాయి. చివరకు రుద్రంపేటకు చెందిన నారాయణరెడ్డి అనే అరటికాయల మండీ వ్యాపారిపై కూడా దాడులు చేశారు. మీ పార్టీ నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్ల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? బందిపోట్లకు నువ్వేమైనా లైసెన్స్ ఇచ్చావా? అందరూ పక్కాగా ప్లాన్ చేసి ఎవరి భూమి అయినా లాక్కుంటారా? జిల్లా కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఉంటే అధికారంలో ఉన్న మిగిలిన పార్టీలు ఏం చేస్తున్నాయి? ఇదే తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో ఉన్నా ఇలాంటి పరిస్థితి లేదు. ఈ రోజు అందరూ భయపడే పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు కొంత మంది మాత్రమే ఫిర్యాదులు చేశారు. ఇకపై ఎవరి భూములు ఆక్రమించినా, వ్యాపారులను బెదిరించినా మాకు చెప్పండి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదు అనంతపురంలో శాంతి, ప్రశాంతత కోరుకునే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు మీకు అండగా ఉంటాయి. పాలేగాళ్లకు ఎవరూ భయపడొద్దు. ఇది పాలేగాళ్ల రాజ్యం కాదు.. తస్మాత్ జాగ్రత్త..! పోలీసులు కూడా అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తొద్దు. దండుపాళ్యం ముఠాలో పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా ఉన్నారు. ఈ బ్యాచ్‌లో 15 మందో.. 20 మందో ఉన్నారు. వాళ్ల లావాదేవీలు చూస్తే అన్నీ బయటకు వస్తాయి. ఈ రోజు అనుచరులను మాత్రమే కాదు.. ముఠా నాయకుడి పేరును కూడా స్వప్న (లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్), ఫకృద్దీన్ (ఎగ్జిబిషన్ నిర్వాహకుడు), మద్యం షాప్ యజమాని కూడా చెప్పారు. తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలి" అని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు.

## అభిమాన నాయకుడు

# ఎంపీకి సంక్రాంతి శుభాకాంక్షలు

- సంక్రాంతి సంబరాలలో పులివెందుల నియోజకవర్గం వైసీపీ నాయకులు
- సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలి
- ప్రజలతో మమేకమైన ఎంపీ అవినాష్ రెడ్డి





**పులివెందుల- సూర్య వాస్తవం :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పులివెందులలోని కడప జిల్లా పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి నివాసంలో గురువారం పులివెందుల నియోజకవర్గ వైసిపి నాయకులు అభిమానులు కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ముందుగా ఎంపీ అవినాష్ రెడ్డి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాలు కలిగి కొత్త కాంతులు ప్రతి ఇంట రావాలని కోరుకోవడం జరుగుతుందని తెలియజేస్తూ సంక్రాంతి సంబరాలలో అభిమాన నాయకులతో గడిపారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి అంటే ప్రకృతి పండగ,సమస్త జీవాలకు జీవం పోసే సూర్యభగవానుడికి అర్పించే కృతజ్ఞతల పండగ.సంక్రాంతి అంటే మన మట్టి పండగ, మన ఊరి గాలి, మన పొలం వాసన,మన పాడి పంటల చిరునవ్వు. సంక్రాంతి అంటే మన పెరిగిన గ్రామాల జ్ఞాపకాలు,ఇంటి ముందు నిలిచే పశువుల కళ్ళలో మెరుపు,అమ్మ చేతి రుచిలో దాగిన ప్రేమ. చిన్నారులను చేతిపట్టి పొలాల వెంట నడిపిస్తూ,మన మట్టిలోని మాధుర్యాన్ని, వాళ్ల మనసుల్లో నాటేపండగ.ముగ్గులతో అలంకరించిన ముంగిట,ఆటపాటలతో మారుమోగే ఊరు, అరిసెల సువాసనతో నిండిన ఇల్లు-ఇదే, నిజమైన సంక్రాంతి! అందరం కలిసి మన పెద్దలను తలుచుకుంటూ, మన మూలాలను గుర్తు చేసుకుంటూ, మన పండుగను మనసారా సెలబ్రేట్ చేద్దాం! అంటూ పేరు పేరునా ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు. శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల గడ్డపై మారుతున్న రాజకీయ సమీకరణాలు..

## - వైసీపీ నుంచి భారీగా చేరికలను ఆహ్వానించిన బీటెక్ రవి





**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగు తోంది. తాజాగా పులివెందుల మున్సిపాలిటీ, పెద్దకొండప్ప కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి (ఎర్ర జగదీష్) తన అనుచరులు, సుమారు 50 కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బి.టెక్ రవి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగదీశ్వర్ రెడ్డి రాకతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో రాష్ట్రం

# మద్యాంధ్ర, జూదాంధ్ర ప్రదేశ్‌లా మారింది



**వేంపల్లె – సూర్య వాస్తవం :** చంద్రబాబు ముఖ్య మంత్రిగా, కూటమిపాలనలో రాష్ట్రం మధ్యాంధ్ర ప్రదేశ్‌గా, జూదాంధ్ర ప్రదేశ్‌గా, డ్రగ్గాంధ్ర ప్రదేశ్‌గా, గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా తయారు కావడం బాధాకరం, దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నరెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండ లానికి నాలుగు మద్యం షాపులు,40 బెల్ట్ షాపులు అన్న విధంగా రాష్ట్రంలో మద్యం పాలసీ తయారైందని, మద్యం ఏరులై పారుతోందని,ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా దొరుకుతుందని,యువత మద్యానికి బానిసలై యువశక్తి నిర్వీర్యం అవుతుందని తులసి రెడ్డి అన్నారు. మూడు జోకర్లు,నాలుగు కళావరులు అన్న రీతిలో రాష్ట్రంలో జూదం జరుగుతోంది, హై స్కూల్ లలో కూడా డ్రగ్స్,గంజాయి దుష్ట సంస్కృతి ప్రవేశించింది. ఈ సంవత్సరం మకర సంక్రాంతి పండుగ మందుబాబుల పండుగగా,తాగుబోతుల పండుగగా,జూదగాల పండుగగా తయారైందని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. అనేక చోట్ల కూటమి నాయకుల ఆధ్వర్యంలో, పర్య వేక్షణలో బరులు ఏర్పాటు చేయడం,కోళ్ల పందాలు, మూడుముక్కలాట,లోపల బయట, గుండాట లాంటి జూద క్రీడలు ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలు అడ్డు అదుపు లేకుండా జరిగాయన్నారు. సంక్రాంతి పండుగ కొంతమంది కూటమి నాయకులకు ఆదాయ వనరుగా మారిందన్నారు. తాగుడు, జూదము, వేట ఇవన్నీ వ్యసనాల కిందికి వస్తాయి.వీటి జోలికి పోవద్దు అని మహాభారతంలో విదుర దేవుడు చెప్పాడు. కానీ దురదృష్టవశాత్తు రాష్ట్రంలో ప్రభుత్వమే వీటిని ప్రోత్సహించడం శోచనీయం. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు ఈ దుష్ట సంస్కృతి వల్ల క్రమేనా రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపుతప్పే ప్రమాదం ఉంది.కాబట్టి ప్రభుత్వం పునరాలోచించాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తులసి రెడ్డి సూచించారు.

## వైసీపీ సత్తా ఏమిటో చూపిస్తాం

### - నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అక్షయ పాత్ర లాంటిదని, నాయకులు వెళ్లి పోతున్నా, మళ్లీ పుడుతూనే ఉంటారని వైసీపీ పులివెందుల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి తొండూరు మండల వైసిపి సోషల్ మీడియా ఇన్చార్జి కంచర్ల ఆది కేశవరెడ్డిలు అన్నారు. పులివెందుల వైసీపీ పార్టీ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంత మంది నాయకులు పార్టీ మారినా పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని, మళ్లీ కొత్తగా నేతలు ఆవిర్భవిస్తుంటారని, అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత అని తెలిపారు.ప్రభుత్వ అసమర్థ విధానాలను ఎండగడుతూనే పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు వైయస్ జగన్మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి రెడ్డి శివ శంకర్ రెడ్డి అధినాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## అంగరంగ వైభవంగా నరసింహ స్వామి వారి గ్రామోత్సవం

### - ఆకట్టుకున్న కోలాటం- డీజే సాంగ్స్ అదుర్స్

**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణ పరిధిలోని వాసవి కాలనీలో శు క్ర వారం శ్రీ నరసింహ స్వామి వారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా శ్రీ నరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే డిజె సాంగ్స్ అదుర్స్ అనిపించాయి. ఇక సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించే సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవి మాత గ్రామోత్సవం కాలనీలోని నలుదిశల సాగింది. ఏడాది పొడవునా ఆపదల నుంచి గట్టె క్కించాలని, ఆయురారోగ్యాలతో పాటు భోగభాగ్యాలు ప్రసాదించాలని భక్తులు నరసింహస్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాల్, మిట్ట శ్రీహరి, జూటూరు నాగ సుగుణాకర్ రావు, పుల్లగూర సుధా, పుల్లగూర బాబు, మిట్ట కరుణాకర్, రెండో వార్డ్ కౌన్సిలర్ మిట్ట గంగా లక్ష్మి, దొంతు రవిశంకర్, మిట్ట వెంకటేశ్వర ప్రసాద్, మిట్ట రామ్మోహన్, దిండుకుర్తి నాగభూషణం, సుంకు రామచంద్ర, మిట్ట వెంకటసుబ్బయ్య, పబ్బతి సంతోష్, పత్తిసోము దొంత మురళి, బచ్చు ఆంజనేయులు తల్లం లోకేష్ జేఎస్టీయూ రాజేష్ పందిళ్ళపల్లి నారాయణరెడ్డి, పాత్రికేయులు వాసవి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.





## నిఖా వేడుకలకు డా.ఎన్.తులసి రెడ్డికి ఆహ్వానం





**రాయచోటి–సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముఖ్య రాష్ట్ర అధికార ప్రతిని డాక్టర్ ఎన్. తులసి రెడ్డిని శుక్రవారం వేంపల్లి లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఏపీసిసి మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా అన్నమయ్య జిల్లా పరిధిలోని నియోజకవర్గ కేంద్రమైన పీలేరులోని హుమ యూన్ ఫంక్షన్ హాల్‌లో జరుగు తన కుమార్తె నూరెచస్మి నిఖా వేడుకలకు ఆహ్వాన పత్రిక అందించారు. ఆహ్వా నించిన వారిలో పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్, మదనపల్లి నియోజకవర్గ సీని యర్ కాంగ్రెస్ నాయకుడు రెడ్డి సాహెబ్ తదితరులు సంయుక్తంగా రాయచోటి పట్టణంలో ఉన్న ప్రముఖ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు మహబూబ్బాషా, మహమ్మద్ రఫీ, డిసిసి చీఫ్ సెక్రటరీ లకు పెళ్ళికి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## దేశ సేవలో ఆర్.ఎస్.ఎస్ పాత్ర గొప్పది

### - భా.జ.పా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె – సూర్య వాస్తవం :** దేశ సేవలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాత్ర ఎంతో గొప్పదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆర్.ఎస్. ఎస్ వారు ముద్రించిన పంచ పరివర్తన పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ఏ విపత్తు జరిగిన ప్రచారానికి నోచుకోకుండా సేవ చేయడం లో ఆర్.ఎస్.ఎస్ ముందంజలో ఉంటుందన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంలో దేశంలో ఉన్న హిందువులను సంఘటితం చేస్తూ 84 వేల చోట్ల హిందూ సమ్మేళనాలను విజయవంతం చేయడం జరిగిందని అయన తెలిపారు.

## శ్రీ రామలింగ చౌడేశ్వరి ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు



**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన సాక్షిమాత,కాశి విశాలాక్షి అయిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.శు క్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పంచామృతా భిషేకం, కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకా రంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకించి ఆలయున రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటువంటి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తదులందరూ పాల్గొన్నారు.

## సాంస్కృతిక సంబరాలతో ఆకట్టుకున్న పౌరాణిక అష్టాంగములు





**పామిడి– సూర్య వాస్తవం:** మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు సాంస్కృతిక కార్యక్రమాల సంబరాలతో సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. భజన పోటీలు కోలాటాలు చెక్కభజనలు,ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వంకరాజుకాలవ గ్రామంలో లక్ష్మీనరసింహ, స్వరరాగనాటక ఉచితశిక్షణాలయం,కళాసమితుల ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహాయ సహకారములతో బుధవారం రాత్రి అష్టాంగములు అను పౌరాణిక ఆణిముత్యాలను ప్రదర్శించారు. రాత్రి అంతటా ప్రజలు నాటకం చూసి తపించిపోయారు. ఈ నాటకంలో నారాయణరెడ్డి సుబ్బన్న హనుమంతురెడ్డి, మహమ్మద్, పరమేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామాంజనేయులు కదిలేశ్వరరావు, వెంకటేష్ ఓబుళపతి, ఆదినారాయణ మారుతీప్రసాద్, గంగాధరరెడ్డి అనితకుమారి, అను నటీనటులు తమ గాన మాధుర్యం, నటనచాతుర్యముతో చూపరులను ఆనందింపజేశారు. వీరికి నవీన్ కుమార్ దేవరాజు శ్రీధర్ నారాయణస్వామి సంగీత ఆలాపన సమకూర్చారు. సంగీత దర్శకులైన నవీన్ కుమార్, దేవరాజులకు గ్రామపెద్దలు సన్మానం చేశారు.

## ఎమ్మెల్యే పుట్టాకు ధన్యవాదాలు తెలిపిన మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** స్థానిక మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను హైదరాబాదులో కలిసి ధన్యవాదాలు తెలిపిన శ్రీ వీరబ్రహ్మేంద్ర మఠం నూతన మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి అలాగే అభివృద్ధి అంశంలో భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం 12వ మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి వారి సోదరులు వీరంభట్లయ్య, దత్తాత్రేయ వారి బావమరది పిపిఎన్ ప్రసాద్ అనంతరం ఎమ్మెల్యే పుట్టాను అందరూ కలిసి ఘనంగా సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లి దేవళం వీధికి చెందిన టైలర్ సయ్యద్ గౌస్ కుమారుడు మహమ్మద్ గౌస్ వివాహం వేంపల్లి ఇమామ్ నగర్ వీధికి చెందిన జనాబ్ షేక్ బాషా కుమార్తెతో వివాహం శుక్రవారం వేంపల్లిలోని షాదీ ఖానా మంటపంలో వైభవంగా జరిగింది.రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, ఐచర్ రమణ, వైకాపా యువ నాయకుడు, సతీష్ రెడ్డి కుమారుడు రోషన్ నాగిరెడ్డి,సింగారెడ్డి రామ చంద్రారెడ్డి తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మానవ సంబంధాలలో భార్యాభర్తల సంబంధం అతి ముఖ్యమైనదని, పవిత్రమైనదని, ఈ బంధానికి వివాహం చట్టబద్ధత, సామాజిక భద్రత కల్పిస్తుందని అన్నారు.

# మానవీయ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

- ఎయిడెడ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కుర్లి చలపతి
- దివ్యాంగులకు గృహోపకరణాలు, కుక్కర్లు పంపిణీ
- ఉచిత వైద్యశిబిరం





**పులివెందుల - సూర్య వాస్తవం :** దేశంలో గ్రామీణ ప్రాంతాలలో వైద్యసౌకర్యాలు మెరుగు పడాలని, గ్రామాల లో జీవిస్తున్న నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకొనే పరిస్థితులు ఉండవు కనుక గ్రామీణ ప్రాంతాలకే వైద్యసేవలు తరలి రావాలని, ఆసదుద్దేశంతోనే, వేముల మండలం బెస్తవారిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ తహశీల్దార్ స్వర్గీయ కుర్లి వెంకటేశు 34వ వర్ధంతి సందర్భంగా, వారి కుమారులు మానవీయ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా, ప్రతి ఏడాది, సంక్రాంతి పర్వదిన సందర్భంగా, బెస్తవారిపల్లె కుర్లి వెంకటేష్ ధర్మ సత్రంలో గత 25 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఉచిత మెడికల్ వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేస్తూ, మండలపరిధిలోని వ్యాధిగ్రస్తులకు ప్రాథమికవైద్యపరీక్షలు చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని, అదేవిధంగా ఈఏడాది మానవీయ చారిటబుల్ ట్రస్ట్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని అవయవాలులేని వికలాంగులకు గహోపకరణాలు అందిస్తూ, తమవంతు చేయూత నందిస్తున్నారని, వారిసేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శమని వేముల కుర్లి ఓబయ్య ఎయిడెడ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కుర్లిచలపతి పేర్కొన్నారు. విశ్రాంత తహసిల్దార్ కుర్లి వెంకటేశు 34వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కుర్లిశంకర్, అనంతపురం నర్సింగ్ కళాశాలల కరస్పాండెంట్ కుర్లి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని, చలపతి తదితరులు ప్రారంభించారు. అనంతరం కుర్లి కుటుంబ సభ్యులు 50 మంది దివ్యాంగులకు గృహ పకరణాలైన ప్రెషర్ కుక్కర్లు వితరణగా పంపిణీ చేశారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అంతకుమునుపు దివంగత కుర్లివెంకటేశు సతీమణి కుర్లి కృష్ణవేణమ్మను వారి కుటుంబసభ్యులు, దివ్యాంగులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. గత రెండు దశాబ్దాలకు పైగా సొంత ఊరిని, జన్మభూమిని మర్చిపోకుండా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, గ్రామీణ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శంకర్ కుటుంబసభ్యులను గ్రామస్తులు అభినందించారు. తదనంతరం దివ్యాంగులు, గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. ఈవైద్యశిబిరంలో దాదాపు 200 మందికి పైగా రోగులు వైద్యచికిత్సలు పొందారు. ఈకార్యక్రమంలో కుర్లి కుటుంబసభ్యులు చలపతి, సావిత్రమ్మ డాక్టర్ శంకర్, ప్రముఖ కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ విజయలక్ష్మి, సతీష్ కుమార్, రేవంత్ యాదవ్, డాక్టర్ వెంకటేష్ యాదవ్, డాక్టర్ ఇరికిరెడ్డి అభిలాష్ రెడ్డి, జనార్ధన్, వికలాంగుల సంఘం నాయకులు చాగలేటి భాస్కర్, శివరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, సునీల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గాలి పటం ఎగుర వేస్తున్న యువకుడికి విద్యుత్ షాక్

- ప్రాణాలను కాపాడిన యువ వైద్యుడు
- యువ వైద్యుడిని అభినందించిన ప్రజలు





**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లెలోని సాయి నగర్‌లో సంక్రాంతి పండుగను పురస్క రించుకుని గురువారం సాయంత్రం గాలి పటం ఎగుర వేస్తుండగా గాలిపటం విద్యుత్ వైర్లపై పడి తిరుపతికి చెందిన సాఫ్ట్ వేర్ మణికంఠకు విద్యుత్ షాక్ తగిలి కింద పడి పోవడం జరిగింది. దీంతో సెలవులపై ఇంటికి వచ్చిన మహమ్మద్ సోహెబ్ ఘటనను చూసి సమయ స్ఫూర్తితో విద్యుత్ షాక్ కు గురై స్పృహ తప్పి పడి ఉన్న మణికంఠకు సిఆర్ పి చేయడం జరిగింది. సిఆర్ పి చేయడం వలన స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి శ్వాస పీల్చుకోవడం జరిగింది. దీంతో యువ వైద్యుడైన మహమ్మద్ సోహెబ్ ను అప్రాంత ప్రజలు అభినందించారు. వివరాల్లోకి వెళ్తే సంక్రాంతి పండుగ సందర్భంగా వేంపల్లెలోని సాయి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రాంప్రసాద్ ఇంటికి తిరుపతికి చెందిన మణికంఠ కుటుంబ సభ్యులు అందరూ వచ్చారు. పండుగను సంతోషంగా చేసుకొనేందుకు సాఫ్ట్ వేర్ మణికంఠ మిద్దె ఎక్కి గాలిపటాలను ఎగుర వేయడం జరిగింది. గాలిపటంకు చెందిన దారం ఇంటి సమీపంలో ఉన్న హై టెన్షన్ విద్యుత్ వైర్లపై పడడంతో సాఫ్ట్ వేర్ మణికంఠకు విద్యుత్ షాక్ తగలండతో ఒక్క సారిగా కింద పడ్డాడు.. ఈ విషయం ఇంటి పక్కనే ఉన్న ఆర్ ఎం పి వైద్యుడు ఖలీల్ కుమారుడు మహమ్మద్ సోహెబ్ కు తెలియడంతో మణికంఠ ప్రాణాలను కాపాడేందుకు సమీపంలోని సురక్షితమైన ప్రాంతానికి తరలించి యువ వైద్యుడు మహమ్మద్ సోహెబ్ స్పృహ తప్పి పడి పోయిన వ్యక్తికి దాదాపు అర గంట పాటు సిఆర్ పి చేయడం జరిగింది. సిఆర్ పి చేసిన కొద్ది క్షణాల్లోనే స్పృహ తప్పి పడిన వ్యక్తి ఊపిరి పీల్చుకోవడం జరిగింది. దీంతో ప్రాణాలు నుండి బయట పడినట్లు నిర్ధారణ చేయడంతో హుటాహుటిన కడప ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఏలూరులో ని మెడికల్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న మహమ్మద్ సోహెబ్ సెలవులపై ఇంటికి రావడంతోనే మణికంఠ ప్రాణాలు దక్కినట్లు అప్రాంత ప్రజలు అంటున్నారు. వైద్య విద్యార్థి చేసిన ధైర్య సాహసానికి మెచ్చు కొంటున్నారు. గాలిలో కలిసి పోతున్న ప్రాణాలను కాపాడి వైద్యవృత్తికి వన్నె తెచ్చినట్లు వేంపల్లె ప్రజలు, విద్యుత్ అధికారులు కొనియాడారు. విద్యుత్ షాక్ తో పల్స్ పడి పోయిన వ్యక్తికి తన వైద్యవృత్తిలో నేర్చుకున్న సిఆర్ పి చిక్సిత పరిజ్ఞానంతో పరిస్థితిని సమయ స్ఫూర్తితో అదుపులోకి తెచ్చి ప్రమాదం లేకుండా అభినందనమని అంటున్నారు. ప్రాణాపాయం నుండి కాపాడిన యువ వైద్యుడికి బాధిత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ప్రాణాపాయం నుండి బయట పడి ప్రస్తుతం కడపలో చిక్సిత పొందుతున్న సాఫ్ట్ వేర్ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇలాంటి యువ వైద్యులు ఉండడం పట్ల కొన్ని ప్రాణాలు గాలిలో కలిసి పోకుండా ఉన్నట్లు పలువురు అంటున్నారు.

## శిరసనంబేడు గ్రామంలో
# ముగ్గుల పోటీల సందడి

- విజేతలకు బహుమతులు అందజేసిన యువనేత వేలూరు కళ్యాణ్ రెడ్డి



**పెళ్లకూరు -సూర్య వాస్తవం :**సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు గ్రామంలో సమస్త స్పోర్ట్స్ అండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కామిరెడ్డి మహేంద్ర నేతృత్వంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు తమ సృజ నాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వేలూరు కళ్యాణ్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మొదటి బహుమతిగా రూ.3,000 నగదు తో పాటు ప్రెషర్ కుక్కర్, రెండవ బహుమతిగా రూ.2,000 నగదు మరియు గ్లాస్ జార్ సెట్, మూడవ బహుమతిగా రూ.1,000 నగదుతో పాటు డైనింగ్ సెట్‌ను అందజేశారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై పండుగ వాతావరణంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు గ్రామంలో సందడి నెలకొల్పి అందరికీ మరిచిపోలేని అనుభూతిని కలిగించాయని స్థానికులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు మరిన్ని నిర్వహించనున్నట్లు సమస్త స్పోర్ట్స్ అండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులు వెల్లడించారు.



# పట్టణ సీఐ బాబీకి బీజేపీ నేతల శుభాకాంక్షలు

**నాయుడుపేట -సూర్య వాస్తవం:**కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని నాయుడుపేట పట్టణ సీఐ బాబీకి స్థానిక బీజేపీ నేతలు శుభాకాంక్షలు తెలియ జేశారు. శుక్రవారం నాయుడుపేట పట్టణ సీఐ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ కార్యదర్శి బొల్లకాయల విజయ భాస్కర్, మాజీ జిల్లా కార్యదర్శి ఆశా చెంచు కృష్ణయ్య, మాజీ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కొపోప్లు సుబ్రహ్మణ్యం లు సీఐ బాబీకి శాలువాలు కప్పి సన్మానించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను వారు ఈ సందర్భంగా అభినందించారు.

# అంగరంగ వైభవంగా కన్యాకాపరమేశ్వరి గ్రామోత్సవం







**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో వాసవి దీక్ష సమితి ఆధ్వర్యంలో శుక్ర వారం సాయంత్రం కన్యాకాపరమేశ్వరి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిధ్యాలుఅనంతపురం వాసవి భజనమండలి వారిచే, భజనలు, చిత్ర వేష ధారణతో బాలలు, బాలలు దీపాలు తీసుకోని ముందుకు సాగుతుండగా మహిళలు కళాశాలు తీసుకోని ఉత్సవం లో కొనసాగారు. అమ్మవారిని ప్రత్యేక పుష్ప మాల లతో శోభయ మానంగా అలంకరించి ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం సాగింది. ఉదయం దేవాలయం గణపతి, వాసవి హెూమాలు అశేష భక్తుల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా నిర్వహించారు.

# “మీకు రూ. 5,000 నగదు వచ్చింది” అనే మెసేజ్ నమ్మకండి

## - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం :** సంక్రాంతి పండుగ వేళ అమాయక ప్రజల ఆశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు. “ఫోన్ పే ద్వారా మీకు రూ.5వేలు నగదు బహుమతి వచ్చింది” అంటూ సోషల్ మీడియాలో వస్తున్న లింకుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ హెచ్చరించారు. ఈ మోసపూరిత లింకులపై ఎస్పీ మాట్లాడుతూ.. ఆ లింక్ క్లిక్ చేస్తే మీ ఖాతా ఖాళీ! వాట్సాప్ గ్రూపుల్లో “పొంగల్ గిఫ్ట్ వోచర్ క్లెయిమ్ చేయండి” లేదా “క్యాష్ బ్యాక్ రివార్డు పేరుతో వస్తున్న మెసేజ్‌లు వందకు వంద శాతం నకిలీవి. ఆ లింకులను క్లిక్ చేయడం వల్ల మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. మీ బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు జమ కావడానికి మీరు ఎప్పుడూ యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేదు. ఎవరైనా పిన్ అడిగితే అది మోసమని గ్రహించండి. రివార్డులు ఏవైనా ఉంటే నేరుగా ఫోన్ పే లేదా గూగుల్ పే యాప్‌లోనే కనిపిస్తాయి. వాట్సాప్ మెసేజ్ ద్వారా ఎటువంటి రివార్డులు రావు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ఇతరులకు పంపి వారిని ఇబ్బందుల్లోకి నెట్టవద్దు. ఒకవేళ పొరపాటున ఎవరైనా ఇలాంటి లింకులు క్లిక్ చేసి నగదు నష్టపోయినట్లయితే, మొదటి గంట లోపే స్పందించడం ముఖ్యం. వెంటనే 1930 అనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి.“మీ అప్రమత్తతే మీ సొమ్ముకు రక్ష. అపరిచిత లింకుల పట్ల జాగ్రత్తగా ఉండండి.” అని ఎస్పీ గారు పేర్కొన్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం...

- చియ్యేడు బండి గోపాల్!
- చియ్యడు గ్రామంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు ముగింపు



**అనంతపురం - సూర్య వాస్తవం :** క్రీడల్లో గెలుపోటములు సహజమని చియ్యేడు గోపాల్ అన్నారు. చియ్యేడు గ్రామంలో గ్రామస్తులు నిర్వహించిన సీజన్ 5 క్రీడా పోటీల ముగింపు సభలో చియ్యేడు బండి గోపాల్ మాట్లాడుతూ.....యువకుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు చియ్యేడు గ్రామం యువకులను ప్రోత్సహిస్తుందన్నారు. ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా భవిష్యత్తులో మరింత కృషి చేయాలన్నారు. క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. అనంతరం చియ్యేడు బండి గోపాల్ బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్ మ్యాచ్‌లో ప్రతి సిక్స్‌కు రూ.500 చొప్పున అయన ప్రదానం చేశారు.



# సంతృప్తినిచ్చిన సంక్రాంతి

## -నిర్మాత సూర్యదేవర నాగవంశీ

సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి, థియేటర్లలో నవ్వుల వర్షం కురిపిస్తూ సంచలన విజయం దిశగా దూసుకుపోతున్న చిత్రం 'అనగనగా ఒక రాజు'. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని.. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక.

భారీ అంచనాలతో సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం.. మొదటి ఆట నుంచే అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. కడుపుబ్బా నవ్వించడమే కాకుండా, భావోద్వేగ సన్నివేశాలతో హృదయాలను హత్తుకొని.. అసలు సిసలైన పండగ సినిమాలా ఉందని.. 'అనగనగా ఒక రాజు' చూసిన ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.41.2 కోట్ల భారీ వసూళ్లతో సంచలనం సృష్టించింది ఈ చిత్రం. ప్రేక్షకుల సంపూర్ణ మద్దతుతో బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురుస్తున్న నేపథ్యంలో.. తాజాగా చిత్ర బృందం థాంక్యూ మీట్ ని నిర్వహించి, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది.

స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "అందరీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు. మాకు ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు, మాకు మద్దతుగా నిలిచిన మీడియా మిత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు. సితార ఎంటర్టైన్మెంట్స్ అనేది బ్లాక్ బస్టర్ ప్రొడక్షన్ హౌస్. ఎన్నో మైలురాయి లాంటి చిత్రాలను అందించారు. అలాంటి సంస్థ నుంచి ఇటీవల ఒకట్రెండు సినిమాలు ఆశించినస్థాయి విజయాన్ని అందుకోలేకపోయాయి. ఇలాంటి తరుణంలో 'అనగనగా ఒక రాజు' రూపంలో ప్రేక్షకులు బ్లాక్ బస్టర్ ను అందించడం.. మా అందరికీ సంతోషాన్ని కలిగించింది. ముఖ్యంగా నాగవంశీ గారి ముఖంలో చిరునవ్వు చూడటం సంతోషాన్ని ఇచ్చింది. ఆయన ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలని కోరుకుంటున్నాను.

మా గురువు గారు త్రివిక్రమ్ గారు, చినబాబు గారి గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. త్రివిక్రమ్ గారు, చినబాబు గారు ఈ సినిమా విషయంలో మమ్మల్ని నమ్మి ఎంతగానో ప్రోత్సహించారు. మేము చెప్పింది నమ్మి ఏ ఎపిసోడ్లు అయితే సినిమాలో ఉంచడానికి వారు అంగీకరించారో.. ఇప్పుడు ఆ ఎపిసోడ్లకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఫస్ట్ హాఫ్ లో మొదటి సన్నివేశం నుంచి ఇంటర్వెల్ వరకు ప్రేక్షకులు ఆగకుండా నవ్వుతున్నారు. సెకండ్ హాఫ్ లో పొలిటికల్ ఎంటర్టైన్మెంట్ కి కూడా అద్భుతమైన స్పందన లభిస్తోంది. నా సినిమాలలో వినోదానికి పెద్ద పీట వేస్తుంటాను. అయితే ఇందులో వినోదంతో పాటు మంచి భావోద్వేగాలను కూడా అందించాలి అనుకున్నాము. నాకు రాజ్‌కుమార్ హిరానీ గారి సినిమాలంటే ఇష్టం. తెలుగులో అలాంటి సినిమా చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశాము. శ్రీరాములు లాంటి ఒక మాస్ థియేటర్లో ఈ సినిమా చూశాం. ప్రేక్షకులు ఎంటర్టైన్మెంట్ ని ఎంతలా ఎంజాయ్ చేశారో, ఎమోషనల్ సీన్లకు అదే స్థాయిలో చప్పట్లు వర్షం కురిపించారు. మా కథ అన్ని వర్గాలు ప్రేక్షకులకు చేరువ అయిందని మాకు అప్పుడే అనిపించింది.



కథానాయకుడిగా నాకిది కేవలం నాలుగో సినిమా. నా మొదటి సంక్రాంతి సినిమా. పోటీలో పెద్ద సినిమాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ మా సినిమాని బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. త్రివిక్రమ్ గారి సినిమాలో ఒక డైలాగ్ ఉంటుంది. మీ వెనకాల ఏదో శక్తి ఉందని. నా వెనకున్న శక్తి ప్రేక్షకులే. నా సినిమాలను మోసేది ప్రేక్షకులే. ఒక్క ఛాన్స్ అంటూ తిరిగే నాకు.. వరుసగా నాలుగు విజయాలు అందించిన ప్ర తి తెలుగు కుటుంబానికి పేరుపేరునా కృతజ్ఞతలు. ఇక ముందు కూడా మిమ్మల్ని అలరించడానికి నా శక్తికి మించి కృషి చేస్తాను.దర్శకుడిగా మారి సహకారం మరువలేనిది. రచనలోనూ తనదైన సహకారం అందించాడు. యాక్సిడెంట్ అయిపోయి ఈ కథ రాస్తున్న సమయంలో నేను కాస్త నిరుత్సాహంతో ఉన్నాను. ఆ సమయంలో మా కో-రైటర్ చిన్మయి నాలో ప్రేరణ నింపింది. మీనాక్షి చౌదరి, రావు రమేష్ గారు అద్భుతంగా నటించారు. అద్భుతమైన సంగీతం అందించిన మిక్కీ జే మేయర్ గారికి

# సంబరాల ఏటిగట్టు పోస్టర్ విడుదల

సాయి దుర్గతేజ్ నటిస్తున్న సినిమా సంబరాల యేటిగట్టు నుంచి సంక్రాంతి సందర్భంగా అద్భుతమైన కొత్త పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రానికి రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్మెంట్‌పై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా రివీల్ చేసిన పోస్టర్‌లో సాయి దుర్గతేజ్ రస్టిక్ అవాతర్ అదరగొట్టారు. బూడిద రంగు చొక్కా, సాంప్రదాయ పంచె కట్టు ధరించి, గ్రామీణ నేపథ్యంలో చెప్పులు లేకుండా నడుస్తూ, తెల్లటి ఎద్దును సున్నితంగా నడిపిస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. గుబురు గడ్డం, తీక్షణమైన చూపు, చిరునవ్వు ఈ మూడు కలిసి ఆయన లుక్ బాగుంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. వెట్రి పళనిసామి అద్భుతమన సినిమాటోగ్రఫీ, బి.అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు. సాయి దుర్గ తేజ్, ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తారాగణం.





# కుర్రాళ్ల అదిరే బోణీ



## - అండర్-19 ప్రపంచకప్
## - అమెరికాపై 6 వికెట్లతో గెలుపు

బులవాయో: అండర్ 19 ప్రపంచకప్ యువ భారత్ బోణీ కొట్టింది. గురువారం జరిగిన తన తొలి మ్యాచ్‌లో అదరగొట్టింది. అమెరికాతో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 35.2 ఓవర్లలోనే కేవలం 107 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత భారత్ లక్ష్యఛేదనకు దిగగా.. వర్షం ఆటంకం కలిగించింది. దీంతో డిఎల్ఎస్ ప్రకారం భారత్ లక్ష్యాన్ని 37 ఓవర్లలో 96 పరుగులుగా నిర్దేశించారు. టీమ్ఇండియా ఈ లక్ష్యాన్ని 17.2 ఓవర్లలోనే కేవలం నాలుగు వికెట్ల మాత్రమే కొల్పొయి ఛేదించింది. అభిజ్ఞాన్ కుందు (42, 41 బంతుల్లో సిక్స్, ఐదు ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బ్యాటర్లలో ఓపెనర్, ఇటీవల అద్భుతంగా రాణిస్తున్న వైభవ్ సూర్యవంశీ (2)తోపాటు మరో ఓపెనర్ ఆయుష్ మాత్రే (19), వేదాంత్ (2), విహాన్ (18), నిరాశపరిచారు. దీంతో 70 పరుగులకు భారత్ నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అభిజ్ఞాన్ కందు ధాటిగా ఆడాడు. కనిష్క (10)తో కలిసి మరో వికెట్ పడకుండా భారత్‌కు విజయాన్ని అందించాడు. అమెరికా బౌలర్లలో రిత్విక్ 2 వికెట్లు తీయగా.. రిషభ్, ఉత్కర్ష్ చెరో వికెట్ పడగొట్టారు.

అంతకుముందు టాస్ గెలిచిన టీమ్ఇండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు నిప్పులు చెరగడంతో అమెరికా 35.2 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. అమీందర్ గిల్ (1), సాహిల్ గార్గ్ (16), అర్జున్ మహేశ్ (16), ఉత్కర్ష్ శ్రీవాస్తవ (0), అమోఘ్న ఆరేపల్లి (3), అద్నిత్ జాంబ్ (18), అదిత్ కప్పా (5), శబరీష్ ప్రసాద్ (7), రిషబ్ షింపి (0) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. అమెరికా బ్యాటర్లలో నితీశ్ సుధాని(36) టాప్ స్కోరర్. అతడే చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. భారత బౌలర్లలో హేనిల్ పటేల్ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. అలాగే, దీపేశ్ దేవేంద్రన్, ఆర్ఎస్ అంబ్రిష్, ఖిలాన్ పటేల్, వైభవ్ సూర్యవంశీ తలో వికెట్ తీసుకున్నారు. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 17న బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

# కోహ్లి ఐసిసి వన్డే ర్యాంకింగ్‌పై ఐసిసి పోస్టు -తొలగింపు

ఐసిసి : వరుస సిరీసుల్లో అద్భుత ప్రదర్శనలతో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానాన్ని సొంతం చేసుకున్న విషయం విదితమే. అయితే కోహ్లి 825 రోజుల పాటు నంబర్ 1 ర్యాంకులో కొనసాగినట్లు ఇటీవల ఐసిసి పోస్టు చేసింది. కానీ వాస్తవానికి విరాట్ క్లోహి 1,547 రోజుల పాటు ఆ స్థానంలో కొన సాగారు. ఈ విషయమై అభిమానులు ఆగ్రహాన్ని వ్యక్తం చేయడంతో ఐసిసి ఆ పోస్టును తొలగించింది.



# కోట్ల రూపాయిల్లో పందేలు...

**ఏలూరు-సూర్య వాస్తవం**

సంక్రాంతి పండగ రెండు రోజుల్లోనే బరుల్లో కోడి పందేలు జోరుగా జరిగాయి. కోడిపందేల్లో వందల కోట్లు చేతులు మారినట్లు సమాచారం. పెద్దయెత్తున భారీగా పందేలు కాయడంతో రెండు రోజుల్లోనూ వంద కోట్ల మేర బెట్టింగ్ లు జరిగాయని సమాచారం. రేపు కనుమ కావడంతో మరింతగా పందెంరాయుళ్లు రెచ్చిపోతారన్న అంచనాలు వినిపిస్తున్నాయి. క్రికెట్ గ్రౌండ్స్ ను మరిపించేలా కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలను సమకూర్చడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కోడి పందేలను వీక్షించేందుకు పెద్దయెత్తున జనం తరలి వచ్చారు. పోలీసుల ఆంక్షలు ఏమాత్రం పనిచేయలేదు. యధేచ్ఛగా పందేలు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఒక్క ఉభయ గోదావరి జిల్లాల్లోనే రెండు వందలకు పైగానే బరులున్నాయి.ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ బరులు ఎక్కువగా ఈ ఏడాది ఏర్పాటు చేశారు. అయితే ఈసారి వరసగా నాలుగుసార్లు కోడిపందేల్లో నెగ్గిన కోడి యజమానికి బుల్లెట్ బండి బహుమతిగా ఇస్తున్నారు. ఫైనల్ విజేతకు ఇన్నోవా కారును బహుమతిగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. బరుల వద్దనే ఇన్నోవా కారును కూడా ఉంచి మొదటి బహుమతి గెలిచిన కోడి యజమానికి అందచేస్తామని ప్రకటించారు. చాలా బరుల్లో పాస్ లు ఉన్న వారికి మాత్రమే గ్యాలరీలోకి అనుమతి ఇస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత జోరుగా కోడి పందేలు జరుగుతున్నాయని చెబుతున్నార. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో జనం ఇక్కడకు క్యూకట్టారు. ఇతర జిల్లాలకుచెందిన వారు కూడా ఇక్కడకు తరలి వచ్చారు.బరులవద్దనే మంచి భోజనాన్నిఅందిస్తున్నారు. కోడికూర, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, చేపల పులుసు తో పాటు గోదావరి జిల్లాలకు చెందిన రుచులన్నీఅక్కడకు వచ్చిన వారికి అందిస్తున్నారు. ఇక మద్యం కూడా అక్కడే అందుబాటులో ఉంది. కాస్ట్ లీ మద్యం నుంచి నాసిరకం సరుకు వరకూ లభ్యమవుతుంది.ఖరీదైన కార్లు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కనిపిస్తున్నాయి. ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ అత్యంత ఖరీదైన కార్లు కూడా బరుల వద్ద కనిపిస్తున్నాయి. అంతా క్యాష్ తోనే పందేలు కాస్తున్నారు. కొన్ని చోట్ల గూగుల్, పేటీఎం ద్వారా పే చేసే సౌకర్యం కల్పించినా ఎక్కువ మంది కరెన్సీ కట్టలనే తీసుకు వచ్చి పందేలు కాస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో జరిగిన ఒక బరిలో ఒక్క పందెంలో దాదాపు కోట్ల రూపాయలుచేతులు మారినట్లు తెలిసింది. కరెన్సీని లెక్కపెట్టేందుకు అక్కడకు మనీ కౌంటింగ్ మిషన్లు కూడా తెచ్చారు.



### యుద్ధానికి ఆజ్యంపోసిన కోడి పందేలు

కేవలం గెలుపోటములే కాకుండా, పందెంలో గెలిచిన వారికి ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను బహుమతిగా ప్రకటించారు. దాంతో ఈ పోటీపై రాష్ట్రంలో అందరి దృష్టి నెలకొంది. రావులపాలెంలో ఏర్పాటు చేసిన ఈ బరిలో పోరు సాగింది. నిర్వాహకులు మొత్తం ఏడు పందేలను నిర్వహించగా, అందులో 5 పందేలు ఎవరు గెలిస్తే వారికి బుల్లెట్ బైక్ ఇస్తామని ప్రకటించారు. ఒక వర్గం అసాధారణ ప్రతిభను కనబరిచి 7 పోటీలకు గాను 6 పందేలలో విజయం సాధించి ఖరీదైన బుల్లెట్ బైక్‌ను సొంతం చేసుకుంది.విజేతగా నిలిచిన గ్రూప్ వారికి డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలుకూరి సతీష్ చేతుల మీదుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్ అందజేశారు. పందెం కోళ్ల పోరాటం చూసి, ఈవెంట్ హాజరైన వారు ఆశ్చర్యపోయారు. కోడి పందేలలో భూములు, ఏళ్ల తర బడిగా సంపాదించిన ఆస్తులు కోల్పో యిన వాళ్లు సైతం ఉంటారు. సంక్రాంతి పండుగ వేళ కోడి పందేల జోరు కనిపిస్తుంటుంది. అయితే, చరిత్రను గమనిస్తే వీటి కారణంగా యుద్ధాలు సైతం జరిగాయని తెలుస్తోంది. అందుకు ఉదహరణే మాచర్ల, గురజాల మధ్య జరిగిన పోరు. ఏపీలో ఎంతో ముఖ్యమైన పల్నాటి యుద్ధం ప్రారంభం కావడానికి కోడిపందెమే ప్రధాన కారణం అని తెలిసిన వారు ఆశ్చర్యపోతున్నారు. పల్నాటి చరిత్రలో మాచర్ల పాలకులకు బ్రహ్మనాయుడు, గురజాల పాలకులకు నాగమ్మ మంత్రులుగా ఉండేవారు. అయితే ఓ సందర్భంలో వీరు సరదాగా కోడి పందేలు వేసుకున్నారు.

కొన్ని విభేదాలను పరిష్కరించేందుకు కోడి పందేలు నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఓడినవారు వనవాసం చేయాలని కండీషన్ పెట్టడంతో కోడి పందేల పోరు మరింతఉత్కంఠ రేపింది. మాచర్ల బ్రహ్మా నాయుడుకు చెందిన కోడిపుంజు చిట్టిమల్లుడు, గురజాల నాగమ్మకు చెందిన కోడిపుంజు సివంగిడేగ బరిలో నిలిచాయి. హోరాహోరాగా జరిగిన కోడి పందెంలో సివంగిడేగ విజయం సాధించగా షరతు ప్రకారం ఓడిన బ్రహ్మానాయుడు వర్గం కొన్నేళ్లపాటు వనవాసానికి వెళు _ంది. తిరిగివచ్చిన తరువాత షరతు ప్రకారం రాజ్యం తిరిగి వ్వాలని కోరగా గురజాల నాగమ్మ వర్గం తరస్క రించ డంతో పల్నాడులో యుద్ధం జరిగందని చరిత్రకారులు పేర్కొన్నారు.

# పదవీ గండం - తెరపైకి కొత్త నేతలు

**నెల్లూరు-సూర్య వాస్తవం**

కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ల సమయం దగ్గర పడుతున్న కొద్దీ కొందరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఇద్దరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా కనపడుతుంది. ఇద్దరు మంత్రులు ఇప్పుడు ఏ విషయం లోనూ వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటి వరకూ కొంత మౌనంగా ఉన్నప్పటికీ త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో తమ పదవికి గండం ఏర్పడుతుందను కున్నారో.. ఏమో..ఈ ఇద్దరు మాత్రం తరచూ మీడియాలో కనిపిస్తున్నారు. ప్రధానంగా విపక్ష నేత వైఎస్ జగన్ పై విమర్శలు చేయడంలో వీరిద్దరూ ముందుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ వంగలపూడి అనిత లేకుంటే.. నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు వంటి వారు మాత్రమే ఎక్కువ విమర్శలు చేసేవారు. ఇక నారాయణ సరేసరి. తాజాగా ఈ జాబితాలోకి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత చేరిపోయారు. ఏవిషయంలోనూ వీరు వెనక్కు తగ్గకుండా తాము జగన్ ను విమర్శించడంలో ముందున్నామని చెప్పకనే చెబుతున్నారు. ఆనం రామ



నారాయణరెడ్డి దేవదాయ శాఖకు ప్రాతినిధ్యం వహి స్తున్నారు. నిన్న మొన్నటి వరకూ ఆయన శాఖపై మాత్రమే స్పందించేవారు. కానీ మంత్రివర్గ విస్తరణలో ఆనంను తప్పించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కానీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మరొకవైపు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి ఆనంను తప్పించి వీరిలో ఒకరికి చంద్రబాబు కేబినెట్ లో స్థానం కల్పించే ఛాన్స్ ఉందన్న ప్రచారం తో ఆనం అలెర్ట్ అయినట్లు కనపడుతుందిఇక మరొక మంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సవిత కూడా ఈ మధ్య కాలంలో యాక్టివ్ గా ఉన్నారు. సవిత నిన్న మొన్నటి వరకూ పెద్దగా మీడియాలో కనిపించలేదు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత పదవికి గండం పొంచి ఉందని ప్రచారం జరుగుతుంది. అనంతపురం జిల్లాలో సీనియర్ నేతలున్నప్పటికీ వారిని కాదని కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సవితకు తొలిదఫా లో మంత్రి పదవి లభించింది. అయితే ఆమె కొన్ని వివాదాలకు కూడా కారణమయ్యారు. సవిత పనితీరుపై పార్టీ నాయకత్వం కూడా గత కొంత కాలంగా సంతృప్తి కరంగా లేకపోవడంతో ఆమెను కేబినెట్ నుంచి విస్తరణలో తప్పిస్తారని అంటున్నారు. సవిత స్థానంలో కాల్వ శ్రీనివాసులు పేరు వినిపిస్తుంది. పయ్యావుల కేశవ్ ను అలాగే ఉంచి సవితను తప్పిస్తారన్న ప్రచారం పెద్దయెత్తున జరుగుతుండటంతో ఆఆమె కూడా ఇటీవల కాలంలో యాక్టివ్ అయ్యారు. మరి చివరకు చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

# టెక్నాలజీతో వైకల్యాన్ని జయించిన రచయిత్రి...

- ‘చేయి వీడని చెలిమి’ నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్
- దివ్యాంగ రచయిత్రి సాయిజ్యోతి నవల ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

**అమరావతి– సూర్య వాస్తవం :**

పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యం ఏమాత్రం అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు మంగళగిరికి చెందిన విభిన్న ప్రతిభావంతురాలు చింతక్రింది సాయిజ్యోతి. అంధత్వాన్ని జయించి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని రచయిత్రిగా మారిన ఆమె, తాజాగా ‘చేయి వీడని చెలిమి’ అనే నవలను రచించారు. ఈ నవలను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సాయిజ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిజ్యోతి అసాధారణ ప్రతిభను, ఆమె కృషిని మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. మంగళగిరి 26వ వార్డుకు



చెందిన సాయిజ్యోతి, పుట్టుకతో వచ్చిన అంధత్వంతో ఏమాత్రం కుంగిపోలేదు. మొబైల్ ఫోన్‌లోని వాయిస్ ఇన్ పుట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తనలోని సృజనాత్మకతకు అక్షర రూపం ఇస్తున్నారు. ‘చైత్రశ్రీ’ అనే కలం పేరుతో ఆమె ఇప్పటికే ‘కవితాంజలి’ అనే కవితా సంపుటిని, ‘మంచుతాకిన ప్రేమ’, ‘ఎవరు అతను’ వంటి నవలలను పాఠకులకు అందించారు.

కేవలం కల్పిత కథలే కాకుండా, సామాజిక స్పృహ కలిగించే అనేక కథలను కూడా ఆమె రచించారు. ప్రస్తుతం ఆమె నూతక్కి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు తనలోని రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శారీరక వైకల్యాన్ని సంకల్ప బలంతో అధిగమించి, తన ప్రతిభతో యువతరానికి సాయిజ్యోతి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని రచయిత్రిగా రాణించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, సాయిజ్యోతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శిష్య బృందం ఆధ్వర్యంలో గురు స్వామి ఇరుముడి



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందులలోని కోతి సమాధి వద్ద గల అయ్యప్ప ఆలయంలో తన శిష్య బృందం ఆధ్వర్యంలో గురుస్వామి వెంకటరామిరెడ్డి ఇరు ముడి కార్యక్రమం జరిగింది. వివ రాల్లోకి వెళితే కార్తీక మాసం ప్రారంభానికి ముందే మాలాధారణ చేసి అనేకమంది అయ్యప్పలకు మాలాధారణ మాల విసర్జన కార్యక్రమాలు అదేవిధంగా కార్తీక మాస మండల కాలంలో అనేకమంది అయ్యప్పలు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందెం ఆడుతున్న ఐదుగురు అరెస్ట్: సీఐ

**మదనపల్లి -సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలంలో కోడి పందెం ఆడుతున్న స్థావరం పై, శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని రెస్ట్ చేశారు. ఇందుకు సంభందించి తాలుక సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కోటవారిపల్లి వద్ద పెద్ద ఎత్తున కోడి పందెం ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం అందిందన్నారు. వెంటనే ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో వెళ్లి, కోడి పందెం స్థావరం పై దాడులు జరిపి, ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ నిందితుల వద్ద రెండు పందెం కోళ్ళు, రూ. 6,300 నగదును సీజ్ చేసి, కేసు నమోదు అనంతరం అరెస్ట్ చేశారు.



## రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పెళ్లకూరు- సూర్యవాస్తవం :** పెళ్లకూరు మండల పరిధి లోని పోలిరెడ్డిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు, సూళ్లూరు పేట--పోలిరెడ్డిపాలెం రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం దిగువ రైలు మార్గంలో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని వద్ద లభించిన రైలు టికెట్లను పరిశీలించారు. అతను ట్రైన్ నంబర్ 20852 భువనేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో ఎగ్మోర్ నుంచి బర్మాపూర్ వరకు జనరల్ టికెట్ తీసుకొని ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



## చివరి దశకు భారత్-ఇయు వాణిజ్య ఒప్పందం

### ఈ నెలలోనే సంతకాలు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :**

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో పెట్టుబడులు, ఎగుమతుల అవకాశాలు దెబ్బతింటున్నాయి. దీంతో యూరోపియన్ యూనియన్ (ఇయు)తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు మన దేశం సంప్రదింపులు కొనసాగిస్తోంది. వాణిజ్య ఒప్పందంలో మొత్తం 24 అధ్యాయాలు ఉండగా, వాటిలో 20 అధ్యాయాలపై భారత్, ఇయు సంతకాలు చేశాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ చెప్పారు. ఈ నెలాఖరులో ఇయు నేతలు భారత్‌లో పర్యటిస్తారు. దానికి ముందే ఒప్పందాన్ని ఖరారు చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు అంటోనియో లూయిస్ శాంటోస్ డ కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వన్ డర్ లెయాన్ ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. 27న జరిగే 16వ భారత్ -- ఇయు సదస్సుకు వారు సహ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ఇయుతో గత మూడు నెలలుగా జరుగుతున్న చర్చలు చివరి దశకు చేరుకున్నాయని, కొన్ని అంశాలపై సంప్రదింపులు కొనసాగుతున్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. రోజువారీ ప్రాతిపదికన చర్చలు జరుగుతున్నాయని, నేతల మధ్య సమావేశం జరగడానికి ముందే ఒప్పందం ఖరారు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత సంవత్సరం భారత్ మూడు వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోగా దక్షిణ అమెరికాలోని మర్కోసర్‌తో ఒప్పందంపై ఇయు సంతకం చేసింది. ఇయుతో ఒప్పందంపై సంతకాలు జరిగి, దానిని అమలు చేస్తే భారత్ కుదుర్చుకున్న అతి పెద్ద వాణిజ్య ఒప్పందం అదే అవుతుంది. అమెరికా సుంకాల కారణంగా పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని ఇయుకు ఎగుమతి అవకాశాలు పెంచుకునేందుకు మన దేశం ప్రయత్నిస్తోంది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )